ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 11 ఆగస్టు 2025

# 'సృష్టి' ఊబిలో కేజీహెచ్ వైద్యులు



- ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేసిన హైదరాబాద్ పోలీసులు
- మరో ముగ్గురు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ప్రమేయంపై ఆధారాల సేకరణ
- ఒకటి, రెండు రోజుల్లో మరింతమందిని అరెస్టు చేస్తారని ప్రచారం
- ఆస్పత్రితో సంబంధం లేదన్న అధికారుల ప్రకటనపై విమర్శలు

విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):

**సంచలనం సృష్టించిన సృష్టి ఫెర్టిలిటీ కేసులో కేజీహెచ్ వైద్యుల ప్రమేయం ఉన్నట్టు తేలింది. దీంతో ఆస్పత్రిలో పనిచేస్తున్న ఇద్దరు వైద్యులను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. విశాఖ కేంద్రంగా నవజాత శిశువుల విక్రయం జరిగినట్టు వారి విచారణలో బయటపడింది. ఇందులో కేజీహెచ్‌లో పనిచేస్తున్న కొందరు వైద్యులు కీలకంగా వ్యవహరించినట్టు చెబుతున్నారు.**

జిల్లా పరిషత్ జంక్షన్ సమీపంలో అనధికారికంగా నిర్వహించిన సృష్టి ఆస్పత్రిలోనే ఈ తతంగమంతా జరిగిందని, నవజాత శిశువుల విక్రయానికి సంబంధించిన లావాదేవీలన్నీ ఇక్కడే పూర్తిచేశారని పోలీసులు నిర్ధారించారు. శిశువుల విక్రయానికి మధ్యవర్తులుగా వ్యవహరించిన ముగ్గురు దళారులను కూడా మూడురోజుల కిందట అరెస్టు చేశారు. అరెస్టుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. కేజీహెచ్‌లో పనిచేస్తున్న పీడియాట్రిక్, గైనిక్ విభాగానికి చెందిన ఇద్దరు వైద్యులకు ఇందులో ప్రమేయం ఉందనే సమాచారంతో ఆధారాలను సేకరించే పనిలో పోలీసులున్నట్టు తెలుస్తోంది. నర్సింగ్ సిబ్బంది ప్రమేయాన్నీ గుర్తించినట్టు తెలుస్తోంది. వీరికి ఎంతవరకు భాగస్వామ్యం ఉందన్న దానిపై స్పష్టత రావాల్సి ఉందంటున్నారు. ఆస్పత్రి వర్గాలు మాత్రం వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సహా మరో ఐదుగురికి పోలీసుల నుంచి పిలుపువచ్చే అవకాశం ఉందంటున్నారు. వీరంతా నేరుగా ఫెర్టిలిటీ సెంటర్‌కు వెళ్లి సేవలందించారా.? ఇక్కడి నుంచి రిఫరల్ చేశారా.? అన్నది తేలాల్సి ఉంది.

## అధికారుల తీరుపై విమర్శలు

ఫెర్టిలిటీ వ్యవహారంలో కేజీహెచ్‌కు చెందిన ఇద్దరు సీనియర్ వైద్యులను అరెస్టు చేసినా, అధికారులు మాత్రం తమ ఆస్పత్రికి సంబంధం లేదని ప్రకటన విడుదల చేయడం హాస్యాస్పదంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రి వైద్యులు అనుమతులు లేని సెంటర్లకు వెళ్లి సేవలందిస్తున్నా అధికారులకు తెలియకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అంతర్గత విచారణ జరిపించి ఎవరెవరు భాగస్వాములనే విషయాన్ని తెలుసుకుంటే మేలని, మీడియాను నిందించడం సమంజసం కాదని పలువురు పేర్కొంటున్నారు.

# రంగంలోకి దళారులు!

ల్యాండ్ పూలింగ్ ప్రకటనతో గ్రామాల్లో ప్రవేశం

భీమన్నదొరపాలెం రైతులతో చర్చలు ప్రారంభం

- గోరింటలో భూములు కొనుగోలు చేసిన మాజీ ఉన్నతాధికారి
- శొంఠ్యాంలో వైసీపీ నేతకు భారీగా భూములు



గోరింటలో ల్యాండ్ పూలింగ్‌కు ఎంపిక చేసిన భూములు

విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):

**ఆనందపురం, పద్మనాభం మండలాల్లో 1,132 ఎకరాల భూ సమీకరణకు వీఎంఆర్‌డీఏ నిర్ణయించడంతో దళారుల హడావిడి మొదలైంది. ఆనందపురం మండలం భీమన్నదొరపాలెంలో కొందరు దళారులు రెండు మూడు రోజులుగా రైతులతో మంతనాలు జరుపుతున్నారు. గోరింటలో సుమారు 60 నుంచి 70 ఎకరాల డీపట్టా భూములు కొనుగోలు చేసిన మాజీ ఉన్నతాధికారికి చెందిన వారు ప్రస్తుతం ఇక్కడ మకాం వేశారు. గత ప్రభుత్వంలో వైసీపీ పెద్దలు, ఉన్నతాధికారులు, వారి అనుయాయులు, ఆనందపురం, పద్మనాభం, భీమిలి, పెందుర్తిలో భారీగానే డీపట్టాభూములు కొనుగోలుచేశారు. కొన్ని చోట్ల అడ్వాన్స్‌లు ఇచి అనధికారిక అగ్రిమెంట్లు చేసుకున్నారు.**

అప్పట్లో డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేశారు. తరువాత వివాదం చెలరేగడంతో ప్రక్రియ నిలిచిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాదిగా ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్‌ల జారీపై నిషేధం కొనసాగుతోంది. అప్పట్లో పెద్దలు కొనుగోలుచేసిన డీపట్టాభూముల్లో చాలావరకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉండిపోయాయి.వాటిలో గోరింట, శొంఠ్యాం గ్రామాలున్నాయి. గోరింట సర్వేనంబరు 108లో 198.31 ఎకరాల్లో సుమారు 60 నుంచి 70 ఎకరాలను మాజీ ఉన్నతాధికారి కొనుగోలు చేశారు. ఆయన తరఫున దళారులు త్రిలోక్, సుభాష్ ఆనందపురం తహసీల్దారు కార్యాలయం నుంచి చక్రం తిప్పారు. ఇప్పుడు ఈ భూములను వీఎంఆర్‌డీఏ భూ సమీకరణకు తీసుకుంటున్నందున అప్రమత్తమయ్యారు.

## సొమ్ము చేసుకునేందుకు...

భూ సమీకరణలో భాగంగా డీపట్టా ఉంటే ఎకరాకు 900 గజాలు, రైతుల ఆక్రమణలో ఉన్న భూములకు (రెవెన్యూ రికార్డుల్లో నమోదుకావాలి. ఇంకా తోటలు ఏపుగా పెరిగి ఉండాలి) 450 గజాల అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇస్తారు). ముందుగా చేసుకున్న అనధికారిక ఒప్పందం మేరకు అభివృద్ధి చేసిన ప్లాట్లను కొనుగోలుదారులకు రైతులు రిజిస్టర్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికీ రైతుల వద్ద ఉన్న డీపట్టా భూములకు సంబంధించే వచ్చే ప్లాట్లు విక్రయించేలా కొందరు రంగంలోకి దిగారు.

## వైసీపీ నేత గుప్పిట్లో...

శొంఠ్యాం సర్వేనంబరు 347పీలో 251.55 ఎకరాల భూమిని సమీకరించేందుకు వీఎంఆర్‌డీఏ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ సర్వే నంబరులో డీపట్టాలు ఎక్కువగా లేకపోయినా రైతుల ఆధీనంలో తోటలు పెంచుతున్నారు. నగరానికి చెందిన వైసీపీ నేత ఒకరు ఈ గ్రామంలో సుమారు 40 నుంచి 50 ఎకరాలు కొనుగోలుచేశారు. అయితే డీపట్టాలకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీకాలేదు. కేవలం రైతుల ఆధీనంలో ఉన్న భూముల విషయంలో ల్యాండ్ పూలింగ్ జరిగితే ఎకరాకు 450 గజాల చొప్పున ప్లాటు వస్తుందని గతంలోనే నిర్ణయం తీసుకున్నారు. దీంతో వైసీపీ నేత, అతని అనుచరులు శొంఠ్యాంలో భూములు కొనుగోలుచేశారు. తాజాగా భూ సమీకరణ ప్రకటన, తదనంతరం గ్రామసభ నిర్వహణతో వైసీపీ నేత, అతని అనుచరులు రైతులతో మాట్లాడినట్టు ... మిగతా 6వ పేజీలో

# మహా రుబాబు

జీవీఎంసీలో కాంట్రాక్టర్ల సంఘం నేత హల్‌చల్

- లాటరీ ద్వారా గుత్తేదారులకు పనుల కేటాయింపు
- బిడ్ వేయాలనుకుంటే గ్రూప్‌లో మెసేజ్ పెట్టాలని ఆదేశం
- ఆసక్తిచూపిన వారిని ఒకచోటకి పిలిచి లాటరీ ద్వారా పనుల కేటాయింపు
- ఇతరులెవరైనా టెండర్ వేస్తే విత్‌డ్రా చేసే వరకు ఒత్తిడి
- యూనియన్ పేరుతో పని విలువలో రెండు శాతం వసూలు
- నేడు భీమిలి జోన్ వర్క్స్ లాటరీకి హాజరుకావాలని ఆదేశం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)



**జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో కాంట్రాక్టర్ల సంఘం నేత రుబాబు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంజనీరింగ్, అకౌంట్స్ విభాగంలోని అధికారుల పేరు చెప్పి కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జీవీఎంసీ టెండర్లు ఆహ్వానిస్తే ఆసక్తి గల కాంట్రాక్టర్లు బిడ్ వేయకుండా బెదిరించి, తాను చెప్పినవారికి మాత్రమే ఆ పని దక్కేలా చక్రం తిప్పుతున్నారని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడతున్నారు. కాదని ఎవరైనా టెండర్‌వేస్తే బెదిరించి బిడ్ ఉపసంహరించుకునేలా ఒత్తిడి చేస్తున్నారంటున్నారు.**

జీవీఎంసీలో నిత్యం అభివృద్ధి పనులు జరుగుతూనే ఉంటాయి. వీటికి సంబంధించి ఇంజనీరింగ్ విభాగం అధికారులు టెండర్లు పిలిస్తే, అర్హత కలిగిన కాంట్రాక్టర్లలో ఆసక్తివున్నవారు ఆ పని స్వభావం, ఖర్చుని అంచనావేసుకుని ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా బిడ్ దాఖలు చేస్తారు. ఎవరు తక్కువకు వేస్తే వారికి అధికారులు పనిని కేటాయిస్తారు. తర్వాత కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్‌చేసుకుని, వర్క్ ఆర్డర్ ఇస్తారు. పని పూర్తిచేసిన తరువాత పరిశీలించి, ఎం-బుక్ రికార్డుచేసి బిల్లు చేస్తారు. జీవీఎంసీ ఖజానాలో నిధుల లభ్యతను బట్టి ప్రాధాన్యతసంఖ్య ఆధారంగా బిల్లు చెల్లిస్తారు. ఇంతవరకూ ఇదే విధానం అమలవుతోంది. కానీ మూడు నెలల కిందట జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘం పేరుతో కొత్తకార్యవర్గం ఏర్పాటైన తర్వాత పరిస్థితి మారిపోయిందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

యూనియన్‌లో ఒక నేత ఇంజనీరింగ్ విభాగంలో అంతా తానై వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ విభాగంతోపాటు అకౌంట్స్ విభాగంలోని ఒక అధికారిని ప్రసన్నంచేసుకుని గుప్పిట్లో పెట్టుకున్నారని, వారికి సదుపాయాలను సమకూర్చుతుండడంతో అతనిమాటే వేదవాక్కు అన్నట్టు అధికారులు వ్యవహరిస్తున్నారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. దీనిని ఆసరాగా తీసుకుని ఆ నేత కాంట్రాక్టర్లపై స్వారీ చేస్తున్నాడంటున్నారు. పబ్లిక్‌వర్క్స్, నీటిసరఫరా విభాగంలో టెండర్లు పడితే వాటికి బిడ్ వేయడానికి వీల్లేదని అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాంట్రాక్టర్ల మధ్య పోటీ పెరిగితే లెస్‌లు పెరిగిపోతున్నాయని, లాభాలు కోల్పోతున్నారని యూనియన్‌నేత విశ్లేషిస్తున్నారని చెబుతున్నారు. పనులకు ఎవరు ఆసక్తిచూపుతున్నారో యూనియన్ వాట్సాప్‌గ్రూపులో పోస్టు పెడుతున్నారని, ... మిగతా 6వ పేజీలో

# పంచాయతీల ఆదాయానికి గండి!

వాణిజ్య భవనాలపై అవ్యాజ ప్రేమ

తక్కువ మొత్తం పన్ను వసూలు

- యాజమాన్యాలతో పంచాయతీలు కుమ్మక్కు
- కార్యదర్శులకు కాసుల వర్షం



పెద్దిపాలెంలోని ఓ కన్వెన్షన్ సెంటర్

విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):

**'ఆనందపురం మండలం పెద్దిపాలెం జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌ను రెండేళ్ల క్రితం నుంచి అద్దెకు ఇస్తున్నారు. పంచాయతీకి పన్ను చెల్లించడంలేదు. పంచాయతీ కార్యదర్శి రెండేళ్లుగా ఈ విషయమే విస్మరించారు. చివరకు డీపీవో ఆదేశాలతో ఏడాదికి రూ. 10 లక్షల చొప్పున నోటీస్ సిద్ధంచేస్తే పంచాయతీరాజ్ ఉన్నతాధికారి బంధువులతో ఒత్తిడి తెస్తున్నారు.**

'ఆనందపురం మండలం గండిగుండంలో ఎంఎన్‌సీ కంపెనీకి అద్దెకు ఇచ్చే భారీ గోదాముకు ఏడాదికి కేవల ం రూ.40వేలు మాత్రమే పన్ను వేశారు. ఇదేమంటే ఒత్తిడి రావడంతో తక్కువ పన్ను వేశానని కార్యదర్శి చెబుతున్నారు. వాస్తవంగా గోదాము విస్తీర్ణం కొలిచి పన్నువేస్తే ఏడాదికి రూ.మూడు లక్షల వరకు పంచాయతీకి ఆదాయం వస్తుంది. నాలుగైదేళ్లుగా పంచాయతీ సుమారు రూ.ఎనిమిది లక్షల ఆదాయం కోల్పోయింది.

'ఆనందపురంలో ఇంటి విస్తీర్ణం వెయ్యి చదరపు అడుగులు. ఏటా రూ.ఎనిమిదివేల పన్ను చెల్లిస్తున్నట్టు యజమాని వివరించారు. అదే వ్యాపార సంస్థలు ఇంకెంత పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

జిల్లాలోని గ్రామ పంచాయతీల పరిధిలో వాణిజ్య భవనాల నుంచి పన్నుల వసూళ్లలో భారీ గోల్‌మాల్ జరుగుతోంది. నామమాత్రంగా పన్ను విధించి పంచాయతీల ఆదాయానికి గండికొడుతున్నారు. అదే సమయంలో పంచాయతీ కార్యదర్శులు అడ్డగోలుగా కాసులు కూడబెట్టుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరికి సర్పంచ్‌లు తోడు కావడంతో పంచాయతీలు ఆదాయం కోల్పోతున్నాయి.

జిల్లాలోని నాలుగు గ్రామీణ మండలాల్లో 79 గ్రామపంచాయతీలున్నాయి. నగరానికి ఆనుకుని ఎక్కువగా ఉండడంతో భారీగా దుకాణాలు, షాపులు, హోటళ్లు, రెస్టారెంట్లు, పెట్రోల్‌బంకులు, ... మిగతా 6వ పేజీలో



# నగరంలో అనుపమ సందడి

హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఆదివారం నగరంలో సందడి చేసింది. పరదా చిత్ర ప్రమోషన్‌లో భాగంగా హోటల్ గ్రీన్‌పార్క్‌లో నిర్వహించిన సమావేశంలో చిత్ర బృందంతో పాటు పాల్గొంది. ఈ సందర్భంగా సినిమాలోని పాత్రకు అనుగుణంగా చీరను పరదాలా కప్పుకుని హొయలొలికించింది.

- 6లో

# పర్సంటేజీలు ఇస్తేనే బిల్లులు!

పనుల ఒప్పందం సమయంలోనే డిమాండ్

- బిల్లుల చెల్లింపునకు మళ్లీ బేరాలు
- విశాఖ ఎస్ఈ కార్యాలయంలో సొంత కోటరీ
- గిరిజన సంక్షేమశాఖ ఈఎన్‌సీ నిర్వాకం



ఈఎన్‌సీ శ్రీనివాస్

విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):

లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన గిరిజన సంక్షేమశాఖ ఇంజనీర్ ఇన్‌చీఫ్ ఎ.శ్రీనివాస్ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. విశాఖలో ఎస్ఈగా పనిచేస్తున్న సమయంలో ఇక్కడి కార్యాలయంలో పనిచేసే సిబ్బందితో సొంత కోటరీని ఏర్పాటు చేసుకుని, కాంట్రాక్టర్లతో బేరాలు నడిపేవారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. లక్షలు విలువైన పనులుచేసి, బిల్లుల కోసం నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగిన కొందరు కాంట్రాక్టర్లలో ఒకరు తాము ఎదుర్కొన్న ఇబ్బందులను 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. టెండర్లద్వారా పనులు దక్కించుకున్న తరువాత అగ్రిమెంట్ కుదుర్చుకోవాలి. ఆ తరువాత పనులు చేసిన మేరకు పార్టు బిల్లులు, చివరకు ఫైనల్ బిల్లులు చెల్లిస్తారు. సాధారణంగా ప్రభుత్వ ఇంజనీరింగ్ శాఖల్లో బిల్లుల సమయంలోనే పర్సంటేజీలు తీసుకుంటారు. బిల్లులో సుమారు 10 శాతం అన్నిస్థాయి అధికారులకు ఇవ్వాల్సిందే. ఇది బహిరంగ రహస్యం. అయితే గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖలో ఎస్ఈగా పనిచేసిన శ్రీనివాస్ మాత్రం రెండుసార్లు పర్సంటేజీలు వసూలు చేసేవారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. పనికి సంబంధించి అగ్రిమెంట్ కుదర్చుకునేటప్పుడు పనివిలువలో ఒక శాతం, ఎస్ఈ కార్యాలయంలో సిబ్బందికి అర శాతం ... మిగతా 6వ పేజీలో

# కూటమి పోస్టుమార్టం

- స్టాండింగ్ కమిటీ ఫలితాలపై విశ్లేషణ
- గాజువాక నియోజకవర్గంలోని కార్పొరేటర్లు భేటీ
- నేడు పార్టీ జిల్లా కార్యాలయంలో సమావేశం?

విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో అనూహ్యంగా వైసీపీ అభ్యర్థి విజయం సాధించడంపై కూటమి పార్టీలు అంతర్మథనం చేస్తున్నాయి. ఈ మేరకు ఆదివారం గాజువాక నియోజకవర్గం పరిధిలోని టీడీపీ, జనసేనపార్టీకి చెందిన కార్పొరేటర్లు భేటీ అయ్యారు. ఎన్నికల ఫలితాలపై విశ్లేషించుకునేందుకు 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు నివాసంలో సమావేశమయ్యారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీచేసిన టీడీపీకి చెందిన 69వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ఓటమిపాలైన విషయం తెలిసిందే. 63 మంది కార్పొరేటర్ల బలం ఉన్నప్పటికీ శ్రీనివాసరావుకు కేవలం 49 ఓట్లు పోలయ్యాయి. కౌన్సిల్‌లో వైసీపీకి 32 మంది మాత్రమే సభ్యులున్నప్పటికీ 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డికి 50 ఓట్లు రావడంతో భారీగా క్రాస్‌ఓటింగ్ జరిగినట్టు స్పష్టమైంది. ఎవరు క్రాస్‌ఓటింగ్‌కు పాల్పడ్డారనేదానిపై టీడీపీ, జనసేనపార్టీల్లో పోస్టుమార్టం ప్రారంభమైంది. గాజువాక నియోజకవర్గం పరిధిలో టీడీపీ, జనసేనకు చెందిన 12 మంది కార్పొరేటర్లు సమావేశమై శ్రీనివాసరావుకు ఎవరెవరు ఓటువేయలేదనేదానిపై చర్చించారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికకు శ్రీనివాసరావు నుంచి డబ్బులు తీసుకుని కూడా దెబ్బ కొట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ డబ్బులను తిరిగి వెనక్కి ఇచ్చేలా చూడాలని అందరూ అభిప్రాయం వ్యక్తంచేశారు. పార్టీ నుంచి పోటీచేసివారెవరైనా సరే ఓటు వేయాల్సి ఉన్నప్పటికీ కొందరు కులాభిమానం, టీడీపీ నేతలపై అసంతృప్తి వంటి కారణాలతో ప్రత్యర్థికి ఓటేసి ద్రోహం చేయడం సరికాదని బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లందరితోనూ సమావేశం ఏర్పాటుచేసే అవకాశం ఉందని, అక్కడ దీనిపై బహిరంగంగానే మాట్లాడాలని ఏకాభిప్రాయం వ్యక్తంచేసినట్టు సమాచారం. ఈ సమావేశంలో టీడీపీ కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలు, గంధం శ్రీనివాసరావు, కాకి గోవిందరెడ్డి, రౌతు శ్రీనివాసరావు, ఇల్లపు ప్రసాద్, నర్సింహపాత్రుడు, బొండా జగన్, రాజాన రామారావు, లేళ్ల కోటేశ్వరరావు, పులి లక్ష్మీబాయి, జనసేనకు చెందిన దల్లిగోవిందరెడ్డి, తిప్పల వంశీరెడ్డి పాల్గొన్నారు.

# కష్టాల్లో స్టీల్ సిటీ బస్ డిపో

- లీజువ్యవధి పూర్తి కానుండడంతో ఖాళీ చేయాలని ఉక్కు యాజమాన్యం లేఖ
- మరో 33 ఏళ్లు లీజు పొడిగించాలంటున్న ఆర్టీసీ
- అందుకోసం సెక్యూరిటీ డిపాజిట్ రూ.133.39 కోట్లు, సేవాచార్జీలు రూ.5.03 కోట్లు చెల్లించాలని షరతు

ద్వారకాబస్‌స్టేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):

ఆర్టీసీ విశాఖ రీజియన్‌లోని స్టీల్ సిటీ డిపో కష్టాల్లో పడింది. ఉక్కు యాజమాన్యంతో 33 సంవత్సరాల లీజు వ్యవధి ఈ ఏడాది నవంబరుతో ముగుస్తుండడంతో ఖాళీ చేసి స్థలాన్ని అప్పగించాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇటీవల ఆర్టీసీ యాజమాన్యానికినోటీసులిచ్చింది. అయితే లీజు పొడిగించి, సహకరించాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు. దీంతో ప్లాంట్ యాజమాన్యం షరతులు విధించింది. ప్రస్తుత భూమి విలువ ఆధారంగా లీజు చెల్లించాలని, వడ్డీలేని సెక్యూరిటీ డిపాజిట్టుగా రూ.133.39 కోట్లు, సేవాచార్జీలురూ.5.03 కోట్లు చెల్లించాలని కోరుతోంది. సంస్థ ఇంతమొత్తం భరించే స్థితిలో లేదని, గతంలో నిర్దేశించిన లీజునే కొనసాగించాలని ఆర్టీసీ కోరుతున్నది. రెండు సంస్థల మధ్య ఇలా ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగుతుండటంతో ఉత్కంఠ నెలకొంది. స్టీల్‌ప్లాంట్, టౌన్‌షిప్, పరిసర కాలనీలకు చెందిన ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకొని 1990లో కూర్మన్నపాలెంలో బస్సు డిపో ఏర్పాటుకు నిర్ణయించిన అధికారులు స్టీల్‌ప్లాంట్ స్థలం గుర్తించారు. ఎనిమిదెకరాల స్థలాన్ని దీర్ఘకాలిక లీజుకు తీసుకున్నారు. దీంతో 33 సంవత్సరాలకు రూ.8.08 లక్షల లీజుచెల్లించేలా రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. ఆ స్థలం చుట్టూ ఆర్టీసీ ప్రహరీ నిర్మించింది. ఐదెకరాల స్థలంలో గ్యారేజీ, బస్సుల పార్కింగ్ ఏర్పాట్లు చేసింది. మరో మూడు ఎకరాల్లో కాంప్లెక్సు, అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ నిర్మించింది. ఇందుకోసం సుమారు రూ.5 కోట్ల వరకు ఖర్చు చేసింది. ఈ డిపోలో ప్రస్తుతం 84 బస్సులున్నాయి. ఇతర ప్రాంతాల ప్రజలతో పాటు ఉక్కు ఉద్యోగులకు మూడు షిఫ్టుల్లో రవాణా సేవలందిస్తున్నాయి. ప్రస్తుతం లీజు గడువు ముగిసి, సంస్థల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తుండడంతో డిపో లేకుండా పోతుందేమోననే ఆందోళన పరిసర ప్రాంత ప్రజల్లో నెలకొంది.




కూర్మన్నపాలెంలోని స్టీల్‌సిటీ బస్ డిపో




సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

## విద్యతోనే సమాజ అభివృద్ధి

**టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**

మధురవాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, అటువంటి విద్యను వేలాది మందికి అందించిన సుంకరి ఆళ్వార్‌దాస్ చిరస్మరణీయులని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన మధురవాడలోని ఆళ్వార్ దాస్ విద్యా సంస్థల ఆవరణలో ఇందిరా విహార్ ఆడిటోరియంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆళ్వార్‌దాస్ విద్యా రంగానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆళ్వార్‌దాస్, ఇందిరాదాస్ విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కళాశాల ప్రతినిధులు ఎస్‌పీ రవీంద్ర, రాజేంద్ర, దీపికా దాస్, తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రినాథునికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి బంగారు సంపెంగలతో పూజలు చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

## ముగిసిన విద్యా పూర్ణ దీక్షా గ్రహణ మహోత్సవాలు



సన్మాన గ్రహీతలతో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

ఎండాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఎండాడలోని కోదండ రామాలయం ఆవరణలో మూడు రోజులుగా జరుగుతున్న విద్యా పూర్ణ దీక్షా గ్రహణ మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎండాడ ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ సుసరపు దుర్గా ప్రసాదశర్మను, టీటీడీ సామ వేద పండితులు, విద్యా ఉపాసకులు సుసరపు రామకృష్ణ శర్మను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెట్టుపల్లి శంకర్రావు, ఎండాడ ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాదు రాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరిని రక్షించిన లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) :రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానాలు చేస్తూ ప్రమాదానికి గురైన ఇద్దరు యువకులను లైఫ్‌గార్డులు రక్షించారు. ఆదివారం గోపాలపట్నం నాయుడుతోటకు చెందిన ఎం. లోకేశ్ (18), షీలానగర్‌కు చెందిన సునంద (20) రుషికొండ బీచ్‌కు విహారానికి వచ్చారు. కొద్దిసేపు తీరంలో విహరించిన వారు అనంతరం సముద్ర స్నానాలకు దిగారు. పెద్ద అల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోతుండగా లైఫ్‌గార్డులు గమనించి, రక్షించారు.

# సింహగిరిపై వ్యాపార ప్రకటనలొద్దు

- వాటి వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతినే అవకాశం
- ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా సింహగిరి అభివృద్ధి
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సింహాచలం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై దాతల సహకారంతో నిర్మాణాలు జరిపినంత మాత్రాన వారి వ్యాపార ప్రకటనలు ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. విజయవాడకు చెందిన శ్రీవైభవ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి డా. బొప్పన ఝాన్సీలక్ష్మీబాయ్ రూ. 3 కోట్లతో చేపట్టనున్న టెన్సిల్ మెంబ్రేన్ స్ట్రక్చర్ నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింహగిరిపై ఇటీవల ఏర్పాటు చేసిన విద్యుత్ తిరు నామాలపై ప్రైవేటు జ్యూవెలరీ వ్యాపార ప్రకటన ఉండడంతో దేవస్థానం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపార ప్రకటనలు ఏర్పాటు చేయడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతినడంతో పాటు కొన్ని ధార్మిక సంస్థల నుంచి విమర్శలు వస్తున్నాయని తెలిపారు. తక్షణమే వాటిని తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా..పాలకమండలి ఏర్పాటు చేయకపోవడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. అందుకు సంబంధించిన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని దేవదాయశాఖ అధికారులను సీఎం ఇప్పటికే ఆదేశించారన్నారు. సింహగిరిని ఆధ్యాత్మికంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. తిరుమల తరహాలో సింహగిరిపై ఉన్న వైకుంఠ నారాయణుని ఆలయం,శ్రీకృష్ణదేవరాయుల విజయ స్థూపం వంటి పలు చారిత్రక ప్రాంతాలకు ప్రాచుర్యం కల్పించాలన్నారు. భక్తుల వసతి కొరత తీర్చేందుకు ఇతర ఆలయాల మాదిరి డోనార్ కాటేజీ స్కీమ్ ప్రవేశపెట్టాలని సూచించారు. దీనివల్ల భక్తులు సింహగిరిపై ఒక రోజు ఉండి పరిసరాల్లోని దర్శనీయ స్థలాలను చూసేందుకు అవకాశం ఉంటుందన్నారు. సింహాచలం అభివృద్ధిపై సీఎంతో త్వరలో చర్చించనున్నట్టు తెలిపారు. కాగా మీడియా ప్రతినిధులు మధురవాడ భూములపై వచ్చిన ఆరోపణల గురించి ప్రశ్నించగా నిజాలు నిగ్గు తేల్చాల్సి ఉందని, అదే అంశాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో పాటు అధికారులను లిఖితపూర్వకంగా కోరినట్టు చెప్పారు. తొలుత ఆయన అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ వేంద్ర త్రినాథరావు,ఈఈ రామకృష్ణ, స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, 98వ వార్డు కార్పొరేటర్ నరసింహం, వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, దాత కుటుంబీకులు ఝాన్సీలక్ష్మీబాయి, కొల్లి వెంకటరమణ, వై. ఆకాష్, సింహగిరి వర్తక సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు ముగ్గు కిరణ్, ఎస్. పైడి రాజు, గుసిడి అవినాష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజూ కొనసాగిన ఆభరణాల తనిఖీ



మ్యూజియంలో తనిఖీలు చేస్తున్న కమిటీ

సింహాచలం,ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి భక్తులు సమర్పించిన రజిత, స్వర్ణ ఆభరణాల తనిఖీ ఆదివారం కూడా కొనసాగింది.తొలిరోజు ఆలయ పద్మనిధిలోని ఆభరణాలను పరిశీలించిన ఫైవ్‌మెన్ కమిటీ రెండవ రోజు మ్యూజియంలోని ఆభరణాలను దేవస్థానానికి చెందిన ప్రత్యేక అంతర్గత కమిటీతో కలిసి తనిఖీ చేశారు. ఆభరణాలన్నింటిని ప్రత్యేక స్టోన్స్‌పై అతికించడంతో వాటిని దేవదాయశాఖ జ్యూవెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ తయారు చేసిన జాబితాతో సరిపోల్చడం మాత్రమే చేయగలిగారు. ఆభరణాలను తూనిక వేయాలంటే వాటిని అమర్చిన రాతి నుంచి వేరు చేయాల్సి ఉంది.అందుకు ప్రత్యేక నిపుణులు అవసరం కావడంతో కమిటీ సభ్యులు ఉన్నతాధికారుల అను మతి కోరనున్నారు. కాగా తొలుత కమిటీ సభ్యులు దేవస్థానం పరిపాలనా భవనంలో సమావేశమై రికార్డులు పరిశీలించారు. అలాగే ఉపాలయాలైన వేంకటేశ్వరస్వామి, పైడితల్లెమ్మ, బంగారమ్మ ఆలయాల్లో అభ రణాలను కూడా తనిఖీ చేశారు. మరో రెండు రోజులు తనిఖీలు కొనసాగుతాయని, అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని కమిటీకి సారథ్యం వహిస్తున్న విజయనగరం జిల్లా దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు, సభ్యులు పల్లంరాజు, సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# సముద్రంలో మునిగి వ్యక్తి మృతి



అప్పలరెడ్డి (ఫైల్‌ఫొటో)

భీమునిపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో సరదాగా ఈతకు దిగిన వ్యక్తి కెరటాల ఉధృతికి లోపలకు కొట్టుకుపోవడంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గొల్లలపాలెం గ్రామానికి ఎలక్ట్రిషియన్ సరగడ అప్పలరెడ్డి (45) ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి భీమిలి బీచ్‌కు విహారానికి వచ్చాడు. కొద్దిసేపు బీచ్‌లో తిరిగిన తరువాత అప్పలరెడ్డి, ఆయన కుమారడు మోజెస్, మరో ఇద్దరు సముద్రంలో స్నానాలకు దిగారు. ఈత కొడుతుండగా పెద్ద కెరటం తాకిడికి అప్పలరెడ్డి సముద్రంలోకి కొట్టుకుపోయాడు. మోజెస్, మిగతా కుటుంబ సభ్యులు చూసి గట్టిగా అరవడంతో ఫొటో గ్రాఫర్స్ కొక్కిరి వీర్రాజు, కాసరపు అనిల్, కొక్కిరి రాము వెంటనే సముద్రంలోకి దూకి ఆయన్ను ఒడ్డుకు చేర్చారు. అప్పటికే బాగా నీరు తాగేయడంతో సీపీఆర్ చేసి తాగేసిన నీటిని కక్కించారు. కొన ఊపిరితో ఉండగా ఆటోలో స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తమ కళ్లెదుటే ఈ దుర్ఘటన జరగడంతో కుటుంబ సభ్యులంతా బోరున విలపించారు. కాగా మృతుడికి భార్య అరుణకుమారి, కుమారుడు మోజెస్,కుమార్తె శ్యామ్ ఉన్నారు. అరుణకుమారి బట్టల దుకాణంలో పని చేస్తోంది. అప్పలరెడ్డి స్వగ్రామం తగరపువలసలోని సంతపేట గొల్లవీధి కాగా బతుకు తెరువు కోసం ఆరేళ్ల క్రితం గొల్లలపాలెం వచ్చారు. హెచ్‌సీ అమ్మోరు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రేపటి నుంచి ఫుట్‌బాల్ పోటీలు

భీమునిపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కలిగొట్ల స్నిగ్ధశ్రీ జయంతి పురస్కరించుకుని మంగళవారం నుంచి శుక్రవారం వరకూ ఉత్తరాంధ్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్టు కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఆదివారం స్థానిక ఫుట్‌బాల్ మైదానంలో పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అందజేయనున్న జెర్సీలను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 వరకూ పోటీలు జరుగుతాయన్నారు.

## 'పాలనలో కూటమి విఫలం'

ఆనందపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందక గ్రామంలో వైసీపీ నాయకులు ఆదివారం సాయంత్రం బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వైఎస్ జగన్ పాలనతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంక శ్రీను, జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, నాయకులు బంక సత్యం, మజ్జి వెంకటరావు,వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## వేములవలస పీఏసీఎస్ చైర్మన్‌గా నాగరాజు

ఆనందపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములవలస పీఏసీఎస్ చైర్మన్‌గా బిపికళ్లాలుకు చెందిన జనసేన పార్టీ నాయకుడు రౌతు నాగరాజు నియమితులయ్యారు. నాగరాజు పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించడంతో ఆయన సేవలను గుర్తించి పీఏసీ ఎస్ చైర్మన్‌గా నియమించారు. ఈమేరకు భీమిలి ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ ఆదివారం నియామక ఉత్తర్వులు అందజేశారు.



విజేతలతో పోటీల కళా సాహితీ సంస్థ సభ్యులు

## ముగిసిన లఘు నాటిక పోటీలు

భీమునిపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో కళా సాహితీ సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న లఘు నాటిక పోటీలు ఆదివారంతో ముగిసాయి. వివిధ పాఠశాలలకు చెందిన 250 మంది బాల, బాలికలు హాజరై 16 నాటికలు ప్రదర్శించారు. కేజీబీవీ కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన డ్రగ్స్ నాటికకు ప్రథమ స్థానం లభించగా భీమిలి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన నైతిక విలువలు నాటికకు ద్వితీయ స్థానం వచ్చింది. భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన మత్తు పదార్థాల వాడకం నాటికకు తృతీయ స్థానం లభించింది. విజేతలకు తగరపువలస మణికంఠ స్వీట్స్ దుకాణం యజమాని ఆదిమూలం నాగరాజు బహుమతులు అందజేశారు. ఆ సంస్థ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ వర్మ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

## గృహ వినియోగ సిలిండర్లు స్వాధీనం

విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పలుచోట్ల పౌర సరఫరాల శాఖాధికారులు దాడులు చేసి, వ్యాపారాలకు ఉపయోగిస్తున్న గృహ వినియోగ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. శని, ఆదివారం చేపట్టిన ఈ దాడుల్లో మొత్తం 67 సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్టు ఆ శాఖాధికారి భాస్కర్ తెలిపారు. ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసే గృహావసరాల సిలిండర్లను వ్యాపారాల కోసం వినియోగించరా దని ఆయన హెచ్చరించారు.

# మహా రుబాబు

... 5వ పేజీ తరువాయి

వారందరినీ ఒకచోటకు చేర్చి లాటరీ తీసి కేటాయిస్తున్నారంటున్నారు. లాటరీలో అవకాశం దక్కినవారే టెండరు వేయాల్సి ఉంటుందని, సింగిల్ టెండరు కాకుండా ఉండేలా మరొకరు ముందుగానే మాట్లాడుకుని తక్కువ లెస్‌కు టెండర్ వేయాలని సూచిస్తున్నారంటున్నారు. ఒకవేళ ఇతరులు అధిక లెస్‌కు టెండర్ వేస్తే వారిని అధికారుల పేర్లు చెప్పి వాపసు తీసుకునేలా ఒత్తిడి చేస్తున్నారని చెబుతున్నారు. జోన్-3 పరిధిలో ఇటీవల పనులకు టెండర్లు పిలిస్తే, అందరినీ ఓ చోట చేర్చి లాటరీ తీసిన తర్వాతే బిడ్ వేసేలా చక్రం తిప్పారని, తాజాగా జోన్-8 పరిధిలో రూ.10.83 కోట్ల విలువైన 93 పనులకు టెండర్లు పిలిస్తే అక్కడా లాటరీ ద్వారా పేర్లు ఎంపిక చేశారనే ఆరోపణలు ఉన్నాయి. భీమిలి జోన్‌కు సంబంధించి 24 పనులకు టెండరు పిలిస్తే వాటికి బిడ్ వేసేందుకు సోమవారం లాటరీ తీస్తామని, ఆసక్తి ఉన్నవారంతా అక్కడ జరిగే సమావేశానికి రావాలని ఆదేశించారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఈ యూనియన్‌నేత రుబాబుపై కాంట్రాక్టర్ల సంఘంతోపాటు ఇంజనీరింగ్ విభాగంలో పెద్దఎత్తున చర్చ జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

## ప్రేక్షకులను ఆహ్లాదపరిచే చిత్రం 'పరదా'

**హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్**




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అనుపమా పరమేశ్వరన్. చిత్రంలో డైరెక్టర్ కాండ్రేగుల ప్రవీణ్ తదితరులు ఉన్నారు

మహారాణిపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రేక్షకులను ఆహ్లాదపరిచేలా పరదా సినిమా ఉంటుందని హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ అన్నారు. ఆనంద్ మీడియా బ్యానర్‌పై విజయ్, శ్రీధర్, నిర్మాతలుగా అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నగరానికి చెందిన కాండ్రేగుల ప్రవీణ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పరదా'.ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా హోటల్ గ్రీన్ పార్కులో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 22న సినిమా విడుదల అవుతుందన్నారు. విభిన్నమైన కంటెంట్, ఫిక్షన్ కథాంశంతో రూపొందిన ఈ చిత్రాన్ని ఎంతో కష్టపడి తీశామని చెప్పారు. డైరెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ బలగం, కోర్టు వంటి చిన్న సినిమాలను ఆదరించారని, అదేవిధంగా తమ పరదాను కూడా ఆదరించాలని కోరారు.

## సందడిగా వీఎంఆర్‌డీఏ క్రీడా ఉత్సవం

విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని అక్కయ్యపాలెంలోని పోర్టు స్టేడియంలో క్రీడా ఉత్సవం ఘనంగా నిర్వహించారు.సంస్థ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గణబాబు, రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లతో పాటు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామల దీపిక, క్రెడాయ్ పూర్వ చైర్మన్ ధర్మేంద్ర, పాల్గొన్నారు.



టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు, సిబ్బంది

# పర్సంటేజీలు ఇస్తేనే బిల్లులు

... 5వ పేజీ తరువాయి

వసూలు చేసేవారంటున్నారు. తరువాత పెట్టిన ప్రతి బిల్లు మంజూరుకు ఒక శాతం ఇచ్చుకోవాల్సిందేనని, లేదంటే కాంట్రాక్టర్లకు చుక్కలు చూపించేవారని వాపోయారు. ఏదైనా కారణంతో మధ్యలో నిలిచిపోయిన పనులు తిరిగి చేపట్టే సమయంలో ఎస్టిమేట్లు పెంచితే మళ్లీ వేరుగా పర్సంటేజ్‌లు తీసుకునేవారని చెబుతున్నారు. ఎస్‌ఈ కార్యాలయంలో పనిచేసే సిబ్బందిలో కొందరిని ఎంపికచేసి వారితో తిరుగులేని కోటరీ ఏర్పాటుచేసుకున్నారని, వారంతా అతని వర్గానికి చెందినవారేనని పేర్కొంటున్నారు.

### అధికారులకు వేధింపులు

విశాఖ సర్కిల్ పరిధి సీతంపేటలో పనిచేసిన ఈఈ ఒకరు ఎస్‌ఈ శ్రీనివాస్ పనితీరు నచ్చక విభేదించారు. దీంతో సదరు ఈఈని నెల్లూరు బదిలీచేశారు. అతడు కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకుని ప్రస్తుతం ఇక్కడే పనిచేస్తున్నారు. గతంలో పార్వతీపురం ఎస్‌ఈగా పనిచేసిన అధికారిని తీవ్రంగా వేధించడంతోపాటు తనకున్న పలుకుబడితో అక్కడి ఎస్‌ఈ కార్యాలయాన్ని రద్దుచేయించారు. అక్కడ పనిచేసే ఎస్‌ఈని ఈఈగా రివర్షన్ చేశారు. ఈఈగా పనిచేసిన మరో అధికారిని డీఈగా రివర్షన్ చేయగా, చివరకు అదే కేడర్‌లో అతను ఉద్యోగ విరమణ చేయాల్సి వచ్చింది. శ్రీనివాస్ ఏసీబీకి పట్టుబడిన నేపథ్యంలో విశాఖ ఎస్‌ఈ, ఈఈ కార్యాలయాల్లో పనిచేస్తున్న అతని మనుషులు ఇప్పటికే కొన్ని ఫైళ్లు దాచేశారని తాజాగా ప్రచారం జరుగుతోంది. వాటిలో అనేక లోపాలు ఉండడంతో పొరపాటున ఏసీబీ అధికారులకు దొరికితే ఇబ్బందులు ఎదురవుతాయనే అప్రమత్తమయ్యారని కాంట్రాక్టర్లు వ్యాఖ్యానిస్తున్నారు.



కన్వెన్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా, పక్కన వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనరు విశ్వనాథన్ కూడా ఉన్నారు.

## వీఎంఆర్‌డీఏ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం

ఎండాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డులోని ఎండాడలో ఏర్పాటు చేసిన వీఎంఆర్‌డీఏ కన్వెన్షన్ సెంటర్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. అనంతరం రూ. 12 కోట్లతో చేపట్టనున్న మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ ఎండాడ జాతీయ రహదారి పక్కన సుమారు రూ. 9 కోట్లతో వీఎంఆర్‌డీఏ నిర్మించిన కన్వెన్షన్ సెంటర్ మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంతో నియోజకవర్గం రూపురేఖలు మారుతాయని చెప్పారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ వీఎంఆర్‌డీఏ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. భీమిలి నియోజకవర్గం పరిధిలో సుమారు రూ. 21 కోట్లతో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశామని, రూ. 9.50 కోట్లతో కన్వెన్షన్ సెంటర్, రూ 5.86 కోట్లతో లేక్ వ్యూ లేఅవుట్ నుంచి వాంబే కాలనీ మీదుగా నగరపాలెం కాలనీ వరకు సీసీ కాలువలు, కల్వర్టులతో మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మిస్తున్నామని చెప్పారు. అలానే నగరపాలెం నుంచి ఎన్‌హెచ్ 16ను కలిపే 40 అడుగుల రహదారి పనులకు రూ. 3 కోట్లు కేటాయించామన్నారు. మరో రూ. 3 కోట్లతో కాపులుప్పాడ శాటిలైట్ టౌన్‌షిప్ మీదుగా నగరంపాలెం వరకు 80 అడుగుల వెడల్పుతో నాలుగు వరసల మాస్టర్ ప్లాన్ రహదారి నిర్మిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, మధుసూదనరావు, 7,8 వార్డులకు చెందిన కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వేర్వేరు ప్రాంతాల్లో చోరీలు

**6 తులాల బంగారం, రూ.10 వేలు అపహరణ**

గోపాలపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో రెండు చోరీలు జరిగినట్టు పోలీసులు తెలిపారు. 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్‌కు చెందిన వై.నారాయణరావు కుటుంబసభ్యులతో కలిసి శనివారం రాత్రి పెళ్లికి వెళ్లారు. ఆదివారం ఉదయం తిరిగి వచ్చే సరికి ఇంట్లోని బీరువా తెరిచి ఉండడంతో చోరీ జరినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలంలో క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించిది. ఈ కేసులో దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. కాగా స్థానిక కొత్తపాలెం నాగేంద్రకాలనీ జంక్షన్‌లోని ఓ కిరాణా దుకాణంలో చోరీ జరిగింది. సరకులు కొనే నెపంతో ఇద్దరు వ్యక్తులు ఆదివారం మధ్యాహ్నం వచ్చారు. యజమాని సరకులు ఇచ్చేలోగా కౌంటర్‌లో ఉన్న రూ.10వేలు అపహరించుకుని పరారయ్యారు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించి, నిందితుల కోసం గాలిస్తున్నారు.



సందర్శకులతో సందడిగా కనిపిస్తున్న రుషికొండ బీచ్

## తీరంలో సండే సందడి

సాగర్‌నగర్, భీమునిపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ, సాగర్ నగర్ బీచ్‌లు సందర్శకులతో ఆదివారం కిటకిలాడాయి. ఎండల తీవ్రత, ఉక్కపోత అధికంగా ఉండడంతో నగరంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొందరు స్నానాలు చేస్తూ సరదాగా గడపగా, మరికొందరు పచ్చికపై కూర్చుని సముద్రం అందాలను ఆస్వాదించారు. మరికొందరు బోటు షికార్‌లో తిరిగారు. భీమిలి బీచ్ కూడా సందర్శకులతో రద్దీగా మారింది. శ్రీకాకుళం, విజయనగరం, నగరంలోని పలు ప్రాంతాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

# పంచాయతీల ఆదాయానికి గండి!

... 5వ పేజీ తరువాయి

ఇంజనీరింగ్, పాలటెక్నిక్, రెసిడెన్షియల్ కళాశాలలున్నాయి. రిజిస్ట్రేషన్ విలువను పరిగణనలోకి తీసుకుని ఇల్లు, వాణిజ్యభవనాలకు పన్నులు విధిస్తారు. అయితే ఇందులో నిబంధనలు పాటించడంలేదు. వాణిజ్యభవనాల యజమానులతో పంచాయతీ పాలకులు మిలాఖత్‌వుతున్నారు. పంచాయతీల్లో ఆదాయం పెంచాల్సిన కార్యదర్శులు కాసులకు కక్కుర్తి పెడుతున్నారు. పంచాయతీల్లో చాలా వరకు సర్పంచ్ మాటే చెల్లుబాటు కావడంతో పంచాయతీ తీర్మానం మేరకు కొద్దిమొత్తం పన్నువిధిస్తున్నారు. జిల్లాలో ఆయా మండలాలనుంచి గత ఆర్థిక సంవత్సరంలో పన్నేతర ఆదాయం(వాణిజ్య, వ్యాపార భవనాలు, ఇతర షాపుల నుంచి ) కేవలం రూ.2.10 కోట్లు ఉంది. ఇంజనీరింగ్, రెసిడెన్షియల్ కళాశాలలు, వాణిజ్యభవనాలు, గోదాములు, ఇతర దుకాణాల నుంచి నిబంధనల మేర పన్ను వసూలు చేయడంలో పంచాయతీలు విఫలమవుతున్నాయి. ఆనందపురం మండలంలో ఒక రెసిడెన్షియల్ స్కూలు ఏటా రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు పన్ను చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.4 లక్షలే వసూలు చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదుల మేరకు చదరపు అడుగుకు రూ.1064 చొప్పున పన్ను విధిస్తూ నోటీసులు జారీచేస్తే అధికారపార్టీకి చెందిన వాడినంటూ బెదిరింపులకు దిగారు. కొద్దికాలం క్రితం మూసివేసిన ఇంజనీరింగ్ కళాశాల సుమారు రూ.50 లక్షల వరకు పన్ను చెల్లించాలి. అది కూడా తూతూమంత్రంగా వేసిన పన్ను మాత్రమే. అయినా పలుకుబడితో అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. పంచాయతీల్లో పన్నుల ఆదాయం పెంచుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలు జారీచేయడంతో జిల్లాలో 10 వేల చదరపు అడుగులు దాటి విస్తీర్ణం ఉన్న వాణిజ్య సముదాయాలను గుర్తించి, పన్ను విధించే పనిలో అధికారులున్నారు. ఇలాంటివి జిల్లాలో 94 ఉండగా ఇంతవరకు 21 భవనాలు/సముదాయాలకు పన్ను విధించారు. కమిషనర్ ఆదేశాలలో వాటి కొలతలు తీసుకున్నప్పుడు గతంలో విధించిన పన్నుకు. ప్రస్తుత పన్నుకు మధ్య భారీ వ్యత్యాసం కనిపిచింది. అంటే ఏళ్లతరబడి పన్ను అధికారులు విఫలం కావడంతో పంచాయతీలు భారీ ఆదాయం కోల్పోయాయి. కాగా మూడువేల చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న వ్యాపార సంస్థలు వందల్లో ఉంటాయి. వీటిని తనిఖీ చేసి నిబంధనల మేరకు పన్ను విధిస్తే జిల్లాలో పన్నేతర ఆదాయం కోట్లకు పెరుగుతుంది. పన్నేతర ఆదాయంపై జిల్లా పంచాయతీ అధికారి ఎంఎస్‌వీ. శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా నిబంధన మేర పన్ను విధించాలని కార్యదర్శులకు ఆదేశించామన్నారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు, దుకాణాలు, మాల్స్ నుంచి పన్ను వసూలు చేసి ఆదాయం పెంచుకునే దిశగా పనిచేస్తున్నామన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# రంగంలోకి దళారులు!

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. భీమన్నదొరపాలెంలో సర్వేనంబరు -1లో 122.53 ఎకరాల్లో డీపట్టా భూములు తక్కువ. రైతుల ఆధీనంలో భూములూ స్వల్పమే. అయినా రెండుమూడు రోజులుగా దళారులు కొందరు రైతులతో మాట్లాడుతున్నారు. గ్రామంలో డీపట్టా భూములను చాలా వరకు కూటమి నేతలు, మరో వ్యాపారి కుటుంబం ఏళ్ల క్రితమే కొనుగోలుచేశారు. గత ప్రభుత్వంలో వైసీపీ పెద్దలతో పరిచయాలను ఆసరాగా చేసుకుని కూటమి నేతలు డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు తెచ్చుకున్నారు. గిడిజాల సర్వేనంబరు 258లో 309 ఎకరాల కొండ, దానికి ఆనుకుని భూములను సమీకరించనున్నారు. ఇక్కడ కూడా కూటమి నేతలు కొందరు చోటా నాయకులతో మంతనాలు జరుపుతున్నారనే వాదన వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో గత భూ సమీకరణలో చోటుచేసుకున్న అక్రమాలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగానిదే.

# ఏడాది గడచినా ప్రారంభం కాని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

- శిథిలమైన హౌసింగ్ బోర్డు క్వార్టర్స్ స్థానంలో నిర్మాణానికి ప్రణాళిక
- రూ.అంచనా వ్యయం రూ.4.63 కోట్లు
- జాప్యంతో రూ.కోట్ల ఆదాయం కోల్పోతున్న హౌసింగ్ బోర్డు


నిరుపయోగంగా ఉన్న హౌసింగ్ స్థలం

వెంకోజీపాలెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల తరబడి శిథిలావస్థలో ఉన్న హౌసింగ్ బోర్డు క్వార్టర్స్‌ను ఎట్టకేలకు కూల్చేశారు... ఇక్కడ కొత్త షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి టెండర్లు ఖరారు చేశారు... ఇంక ఈ ప్రాంతం అభివృద్ధి చెంది సందడిగా మారుతుందని స్థానికులు భావించారు. అయితే ఇది జరిగి ఏడాది గడిచినా ఇక్కడ ఎటువంటి పనులను ప్రారంభించకుండా రూ.కోట్ల విలువైన స్థలాన్ని నిరుపయోగంగా అలానే వదిలేశారు. జీవీఎంసీ 16వ వార్డు హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లోని హౌసింగ్ బోర్డుకు సంబంధించిన స్థలం పరిస్థితి ఇది.

నగరంలోని పాత వెంకోజీపాలెంలో 1980లో కుటుంబాలతో నివసించేవారు. కాలక్రమంలో ఇక్కడ క్వార్టర్స్‌ను హౌసింగ్ బోర్డు సిబ్బంది ఖాళీ చేసి వెళ్లిపోవడంతో ఇవిశిథిలావస్థకు చేరుకున్నాయి. కాగా, హౌసింగ్ బోర్డు కార్యాలయం కోసం కొత్త సొంత భవనం నిర్మాణం నిమిత్తం కార్యాలయాన్ని పాత వెంకోజీపాలేనికి 2011లో తరలించారు. దాదాపుగా గత 25 ఏళ్లుగా క్వార్టర్లు నిరుపయోగంగా ఉండిపోయాయి. ఫలితంగా సంస్థ రూ.కోట్లలో ఆదాయం కోల్పోయింది. అయినా ఉన్నతాధికారులు, స్థానిక అధికారులకు చీమ కుట్టినట్టు కూడా లేదు అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక అధికారులు, ఉన్నతాధికారులు మధ్య సమన్వయం లేకపోవడం కూడా భవన నిర్మాణం జాప్యానికి కారణంగా చెప్పొచ్చు. అదే ప్రైవేటు వ్యక్తులు అయితే ఇలా చేయరని కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు. ఈ చుట్టు పక్కలా పలు షాపింగ్ కాంప్లెక్సులు ఉన్నా సరే, ఇక్కడ షాపింగ్ కాంప్లెక్సు త్వరగా కట్టాలన్న ఆలోచన హౌసింగ్ బోర్డు అధికారులకు రాకపోవడం శోచనీయం. ప్రస్తుతం కార్యాలయాన్ని మిగిలిన క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్నారు. ఇక్కడ 2 ఎకరాల విస్తీర్ణంలో స్టిల్ట్ ప్లస్ నాలుగు అంతస్తులు తరహాలో షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. అక్కయ్యపాలేనికి చెందిన కనస్ట్రక్షన్ సంస్థ ఇక్కడ భవనాలు నిర్మించనున్నట్టు తెలిసింది. రూ.4.63 కోట్ల అంచనా వ్యయంతో కొత్త భవనం నిర్మాణం చేపట్టనున్నట్టు, ప్రస్తుతం నేల చదును చేసినట్టు ఏడాది క్రితమే అప్పటి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రవి కుమార్ తెలిపారు. ఆ తరువాత ఆ అధికారి పదవీ విరమణ చేశారు. కానీ ఇప్పటి వరకూ ఎటువంటి పనులను ప్రారంభించకపోవడం పట్ల స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ నిర్మాణ పనులను మరుగున పడేశారా? ఈ స్థలం ఇలా నిరుపయోగంగా పడి ఉండడమేనా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి స్థలంలో నిర్మాణ పనులను చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### కల్యాణ మండపం ఏర్పాటు చేయాలి...

ఈ ప్రాంతంలో వేలాది మంది ప్రజలు నివసిస్తున్నారు. వీరంతా ఏమైనా శుభకార్యాలు నిర్వహించుకోవాలంటే పక్క ప్రాంతాలలో ఉన్న ప్రైవేటు కల్యాణ మండపాలకు వెళ్లి భారీ మొత్తాన్ని చెల్లించి శుభకార్యాలు నిర్వహించుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆధీనంలో ఉండే విధంగా ఒక కల్యాణ మండపాన్ని ఇక్కడ నిర్మించి, అందుబాటు ధరలో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


షాపింగ్ కాంప్లెక్స్ కోసం తొలగించిన హౌసింగ్ బోర్డు క్వార్టర్స్ (ఫైల్‌ఫొటో)

# జంతువులను దత్తత తీసుకుంటే ఐటీలో 50 శాతం రాయితీకి అవకాశం

- జూ క్యూరేటర్ మంగమ్మ వెల్లడి

ఆరిలోవ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జూ పార్కులో జంతువులను దత్తత తీసుకున్న వారికి ఆదాయ పన్నులో 50 శాతం మినహాయింపు కల్పిస్తున్నట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. జూలో ఆదివారం అంతర్జాతీ సింహాల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతానికి జూలో రెండు సింహాలు ఉన్నాయన్నారు. ఇందులో 12 ఏళ్ల కలిగిన సట్వాడ్ జాతి మగ సింహం గుజరాత్‌లోని జానాగడ్‌లోని సక్కరబాట్ జూలాజికల్ పార్కు నుంచి 2019 ఇక్కడకు తీసుకొచ్చామని తెలిపారు. అలాగే నాలుగు సంవత్సరాల వయసు గల కుమారిని 2023లో అదే జూ పార్కు నుంచి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ రెండు సింహాలు స్నేహంగా ఉంటాయని తెలిపారు.

సంతానోత్పత్తికి తగిన చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె తెలిపారు. సీనియర్ వెటర్నరీ వైద్యురాలు వి.భానుబాబు మాట్లాడుతూ సింహాల సంరక్షణకు తీసుకొంటున్న జాగ్రత్తలు, పరిరక్షణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. అసిస్టెంట్ క్యూరేటర్ గోపి, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ


జాతీయ పతాకాలు పట్టుకొని ర్యాలీ నిర్వహిస్తున్న నేవీ సిబ్బంది

బీచ్ రోడ్డు, ఆగస్టు 10, (ఆంధ్రజ్యోతి) : హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం భారత నేవికా దళ సిబ్బంది జాతీయ పతాకాలను చేత్తో పట్టుకొని తిరంగా రన్ నిర్వహించారు. సుమారు వందమందికి పైగా నేవికా దళ సిబ్బంది ఉత్సాహంగా జాతీయ త్రివర్ణ పతకాలను పట్టుకొని ఈ ర్యాలీలో పాల్గొన్నారు. భారత మాతకు జై అంటూ నినదిస్తూ సాగర తీరంలో సందడి చేశారు. ఈ ర్యాలీ ఆర్కే బీచ్ కాళికామాత దేవాలయం నుంచి వైఎంసీఏ కూడలి వరకు నిర్వహించారు. కార్యక్రమంలో భారత నౌకా దళ సిబ్బంది ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమిలో చేరిన వైసీపీ కార్పొరేటర్లు పశ్చాత్తాపం!

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

మద్దిలపాలెం, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి) : కూటమిలో చేరిన వైసీపీ కార్పొరేటర్లు పశ్చాత్తాపం చెందుతున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అన్నారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ ఎన్నికల్లో వైసీపీ గెలుపొంది బీసీ మహిళను మేయర్‌గా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలలకే వైసీపీ కార్పొరేటర్లను ప్రలోభాలు పెట్టి మేయర్ పీఠాన్ని దక్కించుకున్నారన్నారు. అయితే కూటమిలో చేరిన వైసీపీ కార్పొరేటర్లు తమ తప్పు తెలుసుకుని స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేశారన్నారు. వైసీపీకి ఓటేసిన కార్పొరేటర్లకు మూడు నాలుగు రోజుల నుంచి కూటమి నాయకులు తీవ్రమైన బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి బెదిరింపులకు దిగడం చట్టవ్యతిరేకమన్నారు. మున్సిపల్ చట్టాల ప్రకారం బెదిరింపులకు పాల్పడితే నేరమని, దీనిపై ఎన్నికల కమిషన్, రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

# ఘనంగా ఆదివాసీ వారోత్సవాలు ప్రారంభం


సంప్రదాయ నృత్యాలు ప్రదర్శిస్తున్న గిరిజన విద్యార్థులు

మద్దిలపాలెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద ఆదివారం గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులు థింసా నృత్యాలతో అలరించారు. సంప్రదాయ వస్త్రధారణతో చేతులతో ఒకరి భుజాలను మరొకరు పట్టుకుని చుట్టూ తిరుగుతూ నృత్యం చేసి సందడి చేశారు.

జాతీయ రహదారిపై నిర్వహించిన థింసా నృత్యాన్ని చూసేందుకు ప్రయాణికులు బారులు తీరారు. డప్పుల మోతలకు యువతీయువకులు చేస్తున్న నృత్యాలను తిలకించి పులకించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీగా గిరిజన్ భవన్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా గిరిజన ఉద్యోగుల సంఘం కార్యదర్శి శోభన్‌కుమార్ మాట్లాడుతూ ఎంవీపీకాలనీ గిరిజన భవన్‌లో ఈ నెల 15 వరకు ఆదివాసీ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం నుంచి గిరిజన భవన్ వరకు ర్యాలీ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# 'సంకీర్తనాలాపనతో దైవ దర్శనం'


కార్యక్రమంలో పాల్గొన్న ప్రద్యుమ్న, రాజశేఖర్, కృష్ణమాచార్యులు తదితరులు

సిరిపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సంకీర్తనతో దైవ దర్శనం కలుగుతుందని, ప్రతీ ఒక్కరూ సంగీతాన్ని నేర్చుకొని సాధన చేస్తుండాలని ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పేర్కొన్నారు. సిరిపురంలో గల ప్రసన్న స్వామి దేవాలయంలోని సంగీత విద్వాంసులు పారుపల్లి సత్యనారాయణ స్థాపించిన శారదా అన్నమయ్య సంకీర్తన విద్యాలయం 25వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రముఖ కవి రచయిత పారుపల్లి శ్రీ రామచంద్రమూర్తి రాసిన 'కృష్ణస్మరణ' పుస్తకాన్ని మిహిర ఎం.ప్రద్యుమ్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 25 ఏళ్లుగా కళాకారులు, గాయనీగాయకుల కోసం నిర్వహించిన పారుపల్లి సత్యనారాయణ సంగీత ఉత్సవాలు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో బి.కృష్ణమాచార్యులు, వారణాసి వెంకటేశ్వరశర్మ, పాలూరి శేషమాంబ, ఏపీఎస్ మూర్తి తదితరులు ప్రసంగించారు. అన్నమాచార్య సంకీర్తనలు, త్యాగరాజ స్వామి సంకీర్తనలు, భక్తిగీతాలు ఆలపించి అలరించారు.

## సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం


ఆర్కేబీచ్ వద్ద హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న సత్యసాయి సంస్థల ప్రతినిధులు

బీచ్ రోడ్డు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : శ్రీసత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా, విశాఖ జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థలు యువజన విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్కే బీచ్ వద్ద హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన విభాగం సమన్వయకర్త సాయిప్రశాంత్ మాట్లాడుతూ విశ్వ శాంతి, విశ్వ మానవకల్యాణం కోసం 11 సార్లు సమూహంగా హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించ డం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ అంతటా 100 ప్రదేశాల్లో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. భాగవాన్ శ్రీ సత్యసాయి బాబా బోధించిన ప్రేమ, ఏకత్వం, సేవా తత్త్వంను ప్రతిబింబిస్తూ ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు పీఆర్‌ఎస్‌ఎన్ నాయుడు, యువతీయువకులు, మహిళలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

గాజువాక, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కర్ణవానిపాలెం వై-జంక్షన్‌లో శనివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్వతంత్రనగర్‌కు చెందిన ఎ.మోహన్‌కుమర్(23) రామకృష్ణ అనే యువకుడితో కలిసి ద్విచక్ర వాహనంపై గంగవరం నుంచి వై-జంక్షన్ మీదుగా జగ్గు జంక్షన్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది.

దీంతో మోహన్‌కుమార్‌కు తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మరో యువకుడికి తీవ్ర గాయాలవ్వడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 46, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 30, పచ్చిమిర్చి 62, కాకరకాయలు 28, బీరకాయలు 30, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 32,దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 70, బరబాటి 22, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 74, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడ దుంపలు 44, కంద40, దేముడు చిక్కుడు 82, గోరుచిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

**కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)**

| | |
|---|---|
| విశాఖపట్నం | 510 |
| విజయనగరం | 514 |
| శ్రీకాకుళం | 514 |

**చికెన్ ధరలు**

| | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 93 |
| లైవ్ ధర | 113 |
| విత్ స్కిన్ | 196 |
| స్కిన్‌లెస్ | 206 |

# ఆర్కే బీచ్‌లో సందర్శకుల తాకిడి


సందర్శకులతో కిటకిటలాడుతున్న ఆర్కే బీచ్ ప్రాంతం

బీచ్ రోడ్డు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్కే బీచ్ ఆదివారం సందర్శకులతో నిండిపోయింది. ఎటు చూసినా సందడిగా కనిపించింది. వరుసగా మూడు రోజుల పాటు సెలవులు రావడంతో పలువురు నగర వాసులు కుటుంబ సభ్యులతో ఆహ్లాదాన్ని పంచుకునేందుకు తీరానికి చేరుకున్నారు. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు తరలిరావడంతో బీచ్ ప్రాంతాలు కోలాహలంగా మారాయి. సాయంత్రం వరకు పిల్లాపాపలతో ఉల్లాసంగా గడిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో సందర్శకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో తీర ప్రాంతాలు జన తాకిడితో సంతరించుకున్నాయి. విహార యాత్రలో భాగంగా ఎక్కువగా సముద్రంలో స్నానాలు చేసేందుకు ఆసక్తి చూపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.

# జూలో సందర్శకుల సందడి

- 3 లక్షల 3 వేల 450 రూపాయల ఆదాయం


తెల్ల పులి మోటు వద్ద సందర్శకులు

ఆరిలోవ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జూ పార్కు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. వరుసగా మూడు రోజుల నుంచి సెలవులు కావడంతో అధిక సంఖ్యలో సందర్శకులు కుటుంబాలతో సహా విచ్చేసి జూ పార్కును సందర్శించారు. సుమారు 3,830 మంది సందర్శకుల వచ్చినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. తద్వారా 3 లక్షల 3 వేల 450 రూపాయల ఆదాయం సమకూరినట్టు ఆమె వెల్లడించారు.

## చవితి ఉత్సవాలకు పందిరిరాట


వెర్నిదుర్గానగర్‌లో వినాయక చవితి ఉడుపు రాట మహోత్సవంలో పాల్గొన్న కెల్ల సత్యనారాయణ తదితరులు

ఆరిలోవ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వెర్నిదుర్గానగర్‌లో ఆదివారం వినాయక చవితి ఉడుపు రాట మహోత్సవం కార్యక్రమం స్థానిక యువత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంకి టీడీపీ 13వ వార్డు నాయకులు కెల్ల సత్యనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు నిర్వహణ కేవలం సంప్రదాయంగానే చూడకుండా ఐక్యతను పెంపొందించే కార్యక్రమంగా భావించాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి తురకపూడి బాలస్వామి, టిడిపి సీనియర్ నాయకులు బాలరాజు, గురుమూర్తి, నగేష్ పైడిరాజు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు..

## సీఎం చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ నేతల క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : బీసీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఎనలేని కృషిని చేస్తున్నారని విశాఖ పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పైలా ముత్యాలనాయుడు పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 45వ వార్డు నరసింహనగర్‌లో ఆదివారం చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ బీసీలకు టీడీపీ నిరంతరం అండగా ఉంటుందని, వారి ప్రగతికి సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపులు కేటాయించడంతో పాటు చేనేత కార్మికుల కోసం అయిదు శాతం జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే భరించడం, మగ్గాలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితం, అలాగే మరమగ్గాలకు 500 యూనిట్ల విద్యుత్ రాయితీని కల్పించడం పట్ల సీఎంకు బీసీలపై ఉన్న ప్రేమ తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదనరావు, వాసుపల్లి రాజు, గొలగాని సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబరు 14న విశాఖలో నేషనల్ డాగ్ షో

మాధవధార, ఆగస్టు 10 ( ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది సెప్టెంబరు 14న విశాఖలో 'నేషనల్ డాగ్ షో' నిర్వహించనున్నట్టు విశాఖ కెన్నెల్ అసోసియేషన్ సెక్రటరీ కృష్ణ తెలిపారు. ఈ మేరకు విశాఖ ఆర్ అండ్‌బీ జంక్షన్‌లో గల మారియట్ హోటల్‌లో ఆదివారం డాగ్ షో వివరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. విశాఖ కెన్నెల్ అసోసియేషన్ అధ్వర్యంలో కెన్నెల్ క్లబ్ ఆఫ్ ఇండియా సహకారంతో సెప్టెంబరు 14న గాదిరాజు ప్యాలెస్‌లో ఈ డాగ్ షో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్టు చెప్పారు, డాగ్ షోలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు ఝార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి 50 విభిన్న జాతులకు చెందిన 300కు పైగా డాగ్స్ సందడి చేయనున్నట్టు కృష్ణ తెలిపారు. బీచ్ రోడ్ గాదిరాజు ప్యాలెస్‌లో ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. పోస్టర్ ఆవిష్కరణలో క్రాంతి, గణేష్, రామరాజు, నారాయణరెడ్డి తదితరులు హాజరయ్యారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్‌రాజ్

సీతమ్మధార, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగాను నిత్యం చేయాలని, యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరుశురామ్‌రాజ్ పేర్కొన్నారు. సీతమ్మధారలో గల కృష్ణ మందిరం వద్ద గల హాలులో యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ యోగాసనాల పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పరశురామ్‌రాజు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే యోగా అభ్యసించడం వారి జీవితాల్లోనే మంచి మార్పును తెస్తుందన్నారు. ఈ పోటీలో విద్యార్థులు వేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. విజేతలుగా నిలిచిన వారికి పరుశురామరాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పరశురామ్‌రాజు

అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.రవిశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.రామారావు, ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్, డాక్టర్ జేడీ చక్రవర్తి, డాక్టర్ రాపర్తి శ్రీను, అధిక సంఖ్యలో పోటీదారులు పాల్గొన్నారు.

## రైలులో మరిచిపోయిన బ్యాగు ప్రయాణికుడికి అందజేత



ప్రయాణికుడికి బ్యాగు అందజేస్తున్న ఆర్పీఎఫ్ ఎస్సై మిశ్రా తదితరులు

» బ్యాగులో 125 గ్రాముల బంగారు నగలు, ల్యాప్‌టాప్, బ్యాంకు కార్డులు

» ఆర్పీఎఫ్ సిబ్బందికి పలువురి అభినందనలు

మర్రిపాలెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రైలు దిగిన సమయంలో సుమారు రూ.15 లక్షల విలువైన బంగారు అభరణాలు, ఇతర వస్తువులతో కూడిన బ్యాగును మరిచిపోయి, అనంతరం ఆర్పీఎఫ్ సిబ్బందికి ఫిర్యాదు చేయడంతో వారు సత్వరం స్పందించి ఆయా వస్తువులతో కూడిన బ్యాగును గుర్తించి సంబంధిత బాధితునికి అందజేశారు. వివరాలిలా ఉన్నాయి.

రాయపూర్‌కు చెందిన కె.రవికుమార్ రావు (37) శనివారం రాత్రి కోర్బా ఎక్స్‌ప్రెస్‌లో రాయపూర్ నుంచి బయలుదేరి సింహాచలం వచ్చారు. ఆదివారం ఉదయం రైలు సింహాచలం రైల్వేస్టేషన్ చేరుకోగా, ఆయన తన బ్యాగును మరిచిపోయి రైలు దిగిపోయారు. బ్యాగ్ మరిచి పోయినవిషయం కొంతసేపటి తర్వాత గుర్తించి అక్కడే ఉన్న రైల్వే ఆర్పీఎఫ్ ఏఎస్సై కేఆర్‌కే రావుకు సమాచారం ఇచ్చారు. ఏఎస్ఐ వెంటనే స్పందించి అదే రైలులోవిధుల్లో ఉన్న మర్రిపాలెం రైల్వే సిబ్బందికి వివరాలు అందించారు. దీంతో ఆర్పీఎఫ్ సిబ్బంది సదరు సీటు వద్ద ఆభరణాలు, ఇతర వస్తువులతో కూడిన బ్యాగును గుర్తించి మర్రిపాలెం ఆర్పీఎఫ్ ఔట్ పోస్టులో అందజేశారు. సుమారు 125గ్రాముల బంగారు నగలు, ల్యాప్‌టాప్, బ్యాంకు కార్డులు, నగదు రూ.500 గల ఆ బ్యాగును బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో మర్రిపాలెం ఆర్పీఎఫ్ ఎస్సై ఏకే మిశ్రా, ఏఎస్సై కేఆర్‌కే రావు,సిబ్బంది నాగేశ్వరరావు, వికాశ్‌పూరి పాల్గొన్నారు.

## ఏపీఎల్ మ్యాచ్‌ను వీక్షించిన బధిరులు, అనాథలు

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరుగుతున్న ఏపీఎల్-4 టోర్నీలో ఆదివారం రాత్రి భీమవరం బుల్స్, రాయల్స్ ఆఫ్ రాయలసీమ మధ్య జరిగిన మ్యాచ్‌ను అనాథలు, బధిరులు వీక్షించారు. నిర్వాహకులు వీరికి ప్రత్యేక గ్యాలరీ కేటాయించి మ్యాచ్‌ను తిలకించే ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా అల్పాహారం, పానీయాలతో పాటు రాత్రి భోజనాలు కూడా ఏర్పాటు చేసి ఉత్సాహపరిచారు. వారితో ఏసీఏ ప్రతినిధులు, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ప్రతినిధులు కలిసి మ్యాచ్‌ను తిలకించారు.



బధిరులు, అనాథలతో కలిసి మ్యాచ్ తిలకిస్తున్న ఏసీఏ, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ప్రతినిధులు

## ముగిసిన చెస్ రాపిడ్, బ్లిట్జ్ టోర్నీ




పతకాలు సాధించిన విజేతలు

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఆల్ విశాఖ చెస్ సంఘం, చైతన్య చెస్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి రాపిడ్, బ్లిట్జ్ టోర్నీ కమ్ జిల్లా జట్టు ఎంపికలు ఆదివారంతో ముగిశాయి. నగరంలోని చాణక్య డిగ్రీ కాలేజీలో జరిగిన ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా రెండు ఈవెంట్లలో సుమారు 200 మంది ప్రాతినిధ్యం వహించారు. రాపిడ్‌లో పి.కృష్ణ వరన్య, ఎస్.చంద్రశేఖర్....బ్లిట్జ్‌లో ఎస్.చంద్రశేఖర్, కె.ప్రశాంత్ విజేలుగా నిలిచారు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన ఈ క్రీడాకారులు వచ్చే నెల 13, 14న నంద్యాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి రాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆల్ విశాఖ చెస్ సంఘం కార్యదర్శి మణికంఠరావు తెలిపారు.

## వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో క్రీడా పోటీలు

మురళీనగర్, ఆగస్టు 10 ( ఆంధ్రజ్యోతి) : భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో ఆదివారం నడక, ఈత పోటీలు నిర్వహించారు. ఉదయం పార్కు వాకింగ్ ట్రాక్‌లో నడక పోటీలను పార్కు కమిటీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. 30 నుంచి 60 ఏళ్ల పైబడిన వారికి కూడా పోటీల్లో స్థానం కల్పిస్తూ వేర్వేరు విభాగాలుగా నడక పోటీలు చేపట్టారు. కాలనీ నివాసితులు, పార్కు కమిటీ మెంబర్లు, మహిళలు ఉత్సాహంగా నడక పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందిస్తామని పార్కు కమిటీ కార్యదర్శి పీవీఎస్ రాజు తెలియజేశారు. ఉదయం 6 గంటలకు నడక పోటీలను నిర్వహించారు. అనంతరం పార్కు సమీపంలోని స్విమ్మింగ్ పూల్‌లో పలు విభాగాలుగా ఈత పోటీలను నిర్వహించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ విభాగాలుగా జరిగిన పోటీల్లో బాలబాలికలు హాజరై పతకాల కోసం పోటీపడ్డారు. స్విమ్మింగ్ విజేతలకు కూడా ఆగస్టు 15వ తేదీన బహుమతులు, ప్రశంసాపత్రాల్ని అందించనున్నారు.

## లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



సీతంపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి ఆశీల్‌మెట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..సుమారు 40 నుంచి 45 ఏళ్ల వ్యక్తి శనివారం రాత్రి ఆశీల్‌మెట్ట నుంచి రామాటాకీస్ రోడ్డువైపు వస్తుండగా లారీ ఢీకొంది. దీంతో రోడ్డుపై పడిపోయిన ఆ వ్యక్తి తీవ్ర గాయాలుపాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం తెలుసుకున్న ద్వారకా పోలీసు స్టేషన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొనేసరికే మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్ మార్చురీలో మృత దేహన్ని భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ద్వారకా పోలీసు స్టేషన్ 6305187009, సీఐ 9440904332,ఎస్ఐ 8331041588 కు సమాచారంఇవ్వాలని కోరారు.

# వేర్వేరు ప్రాంతాల్లో చోరీలు

» 6 తులాల బంగారం, రూ.10 వేలు అపహరణ

గోపాలపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో రెండు చోరీలు జరిగినట్టు పోలీసులు తెలిపారు. 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్‌కు చెందిన వై.నారాయణరావు కుటుంబసభ్యులతో కలిసి శనివారం రాత్రి పెళ్లికి వెళ్లారు. ఆదివారం ఉదయం తిరిగి వచ్చే సరికి ఇంట్లోని బీరువా తెరిచి ఉండడంతో చోరీ జరినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలంలో క్లూస్ టీమ్ ఆధా రాలు సేకరించిది. ఈ కేసులో దొంగలను పోలీసులుఅదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. కాగా స్థానిక కొత్తపాలెం నాగేంద్రకాలనీ జంక్షన్‌లోని ఓ కిరాణా దుకాణంలో చోరీ జరిగింది. సరకులు కొనే నెపంతో ఇద్దరు వ్యక్తులు ఆదివారం మధ్యాహ్నం వచ్చారు. యజమాని సరకులు ఇచ్చేలోగా కౌంటర్‌లో ఉన్న రూ.10వేలు అపహరించుకుని పరారయ్యారు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించి, నిందితుల కోసం గాలిస్తున్నారు.

# మహా రుబాబు

... 5వ పేజీ తరువాయి

వారందరినీ ఒకచోటకు చేర్చి లాటరీ తీసి కేటాయిస్తున్నారంటున్నారు. లాటరీలో అవకాశం దక్కినవారే టెండరు వేయాల్సి ఉంటుందని, సింగిల్ టెండరు కాకుండా ఉండేలా మరొకరు ముందుగానే మాట్లాడుకుని తక్కువ లెస్‌కు టెండర్ వేయాలని సూచిస్తున్నారంటున్నారు. ఒకవేళ ఇతరులు అధిక లెస్‌కు టెండర్ వేస్తే వారిని అధికారుల పేర్లు చెప్పి వాపసు తీసుకునేలా ఒత్తిడి చేస్తున్నారని చెబుతున్నారు.

జోన్-3 పరిధిలో ఇటీవల పనులకు టెండర్లు పిలిస్తే, అందరినీ ఓ చోట చేర్చి లాటరీ తీసిన తర్వాతే బిడ్ వేసేలా చక్రం తిప్పారని, తాజాగా జోన్-8 పరిధిలో రూ.10.83 కోట్ల విలువైన 93 పనులకు టెండర్లు పిలిస్తే అక్కడా లాటరీ ద్వారా పేర్లు ఎంపిక చేశారనే ఆరోపణలు ఉన్నాయి. భీమిలి జోన్‌కు సంబంధించి 24 పనులకు టెండరు పిలిస్తే వాటికి బిడ్ వేసేందుకు సోమవారం లాటరీ తీస్తామని, ఆసక్తి ఉన్న వారంతా అక్కడ జరిగే సమావేశానికి రావాలని ఆదేశించారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఈ యూనియన్‌నేత రుబాబుపై కాంట్రాక్టర్ల సంఘంతోపాటు ఇంజనీరింగ్ విభాగంలో పెద్దఎత్తున చర్చ జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

# రంగంలోకి దళారులు!

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. భీమన్నదొరపాలెంలో సర్వేనంబరు -1లో 122.53 ఎకరాల్లో డీపట్టా భూములు తక్కువ. రైతుల ఆధీనంలో భూములూ స్వల్పమే. అయినా రెండు మూడు రోజులుగా దళారులు కొందరు రైతులతో మాట్లాడుతున్నారు. గ్రామంలో డీపట్టా భూములను చాలా వరకు కూటమి నేతలు, మరో వ్యాపారి కుటుంబం ఏళ్ల క్రితమే కొనుగోలుచేశారు. గత ప్రభుత్వంలో వైసీపీ పెద్దలతో పరిచయాలను ఆసరాగా చేసుకుని కూటమి నేతలు డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు తెచ్చుకున్నారు. గిడిజాల సర్వేనంబరు 258లో 309 ఎకరాల కొండ, దానికి ఆనుకుని భూములను సమీకరించనున్నారు. ఇక్కడ కూడా కూటమి నేతలు కొందరు చోటా నాయకులతో మంతనాలు జరుపుతున్నారనే వాదన వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో గత భూ సమీకరణలో చోటుచేసుకున్న అక్రమాలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగానిదే.

# పర్సంటేజీలు ఇస్తేనే బిల్లులు!

... 5వ పేజీ తరువాయి

వసూలు చేసేవారంటున్నారు. తరువాత పెట్టిన ప్రతి బిల్లు మంజూరుకు ఒక శాతం ఇచ్చుకోవాల్సిందేనని, లేదంటే కాంట్రాక్టర్లకు చుక్కలు చూపించేవారని వాపోయారు. ఏదైనా కారణంతో మధ్యలో నిలిచిపోయిన పనులు తిరిగి చేపట్టే సమయంలో ఎస్టిమేట్లు పెంచితే మళ్లీ వేరుగా పర్సంటేజ్‌లు తీసుకునేవారని చెబుతున్నారు. ఎస్ఈ కార్యాలయంలో పనిచేసే సిబ్బందిలో కొందరిని ఎంపికచేసి వారితో తిరుగులేని కోటరీ ఏర్పాటుచేసుకున్నారని, వారంతా అతని వర్గానికి చెందినవారేనని పేర్కొంటున్నారు.

### అధికారులకు వేధింపులు

విశాఖ సర్కిల్ పరిధి సీతంపేటలో పనిచేసిన ఈఈ ఒకరు ఎస్ఈ శ్రీనివాస్ పనితీరు నచ్చక విభేదించారు. దీంతో సదరు ఈఈని నెల్లూరు బదిలీచేశారు. అతడు కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకుని ప్రస్తుతం ఇక్కడే పనిచేస్తున్నారు. గతంలో పార్వతీపురం ఎస్ఈగా పనిచేసిన అధికారిని తీవ్రంగా వేధించడంతోపాటు తనకున్న పలుకుబడితో అక్కడి ఎస్ఈ కార్యాలయాన్ని రద్దుచేయించారు. అక్కడ పనిచేసే ఎస్ఈని ఈఈగా రివర్షన్ చేశారు. ఈఈగా పనిచేసిన మరో అధికారిని డీఈగా రివర్షన్ చేయగా, చివరకు అదే కేడర్‌లో అతను ఉద్యోగ విరమణ చేయాల్సి వచ్చింది. శ్రీనివాస్ ఏసీబీకి పట్టుబడిన నేపథ్యంలో విశాఖ ఎస్ఈ, ఈఈ కార్యాలయాల్లో పనిచేస్తున్న అతని మనుషులు ఇప్పటికే కొన్ని ఫైళ్లు దాచేశారని తాజాగా ప్రచారం జరుగుతోంది. వాటిలో అనేక లోపాలు ఉండడంతో పొరపాటున ఏసీబీ అధికారులకు దొరికితే ఇబ్బందులు ఎదురవుతాయనే అప్రమత్తమయ్యారని కాంట్రాక్టర్లు వ్యాఖ్యానిస్తున్నారు.

# పంచాయతీల ఆదాయానికి గండి!

... 5వ పేజీ తరువాయి

ఇంజనీరింగ్, పాలటెక్నిక్, రెసిడెన్షియల్ కళాశాలలున్నాయి. రిజిస్ట్రేషన్ విలువను పరిగణనలోకి తీసుకుని ఇల్లు, వాణిజ్యభవనాలకు పన్నులు విధిస్తారు. అయితే ఇందులో నిబంధనలు పాటించడంలేదు. వాణిజ్యభవనాల యజమానులతో పంచాయతీ పాలకులు మిలాఖత్‌వుతున్నారు. పంచాయతీల్లో ఆదాయం పెంచాల్సిన కార్యదర్శులు కాసులకు కక్కుర్తి పెడుతున్నారు. పంచాయతీల్లో చాలా వరకు సర్పంచ్ మాటే చెల్లుబాటు కావడంతో పంచాయతీ తీర్మానం మేరకు కొద్దిమొత్తం పన్నువిధిస్తున్నారు. జిల్లాలో ఆయా మండలాలనుంచి గత ఆర్థిక సంవత్సరంలో పన్నేతర ఆదాయం(వాణిజ్య, వ్యాపార భవనాలు, ఇతర షాపుల నుంచి) కేవలం రూ.2.10 కోట్లు ఉంది.

ఇంజనీరింగ్, రెసిడెన్షియల్ కళాశాలలు, వాణిజ్యభవనాలు, గోదాములు, ఇతర దుకాణాల నుంచి నిబంధనల మేర పన్ను వసూలు చేయడంలో పంచాయతీలు విఫలమవుతున్నాయి. ఆనందపురం మండలంలో ఒక రెసిడెన్షియల్ స్కూలు ఏటా రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు పన్ను చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.4 లక్షలే వసూలు చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదుల మేరకు చదరపు అడుగుకు రూ.1064 చొప్పున పన్ను విధిస్తూ నోటీసులు జారీచేస్తే అధికారపార్టీకి చెందిన వాడినంటూ బెదిరింపులకు దిగారు. కొద్దికాలం క్రితం మూసివేసిన ఇంజనీరింగ్ కళాశాల సుమారు రూ.50 లక్షల వరకు పన్ను చెల్లించాలి. అది కూడా తూతూమంత్రంగా వేసిన పన్ను మాత్రమే. అయినా పలుకుబడితో అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.

పంచాయతీల్లో పన్నుల ఆదాయం పెంచుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలు జారీచేయడంతో జిల్లాలో 10 వేల చదరపు అడుగులు దాటి విస్తీర్ణం ఉన్న వాణిజ్య సముదాయాలను గుర్తించి, పన్ను విధించే పనిలో అధికారులున్నారు. ఇలాంటివి జిల్లాలో 94 ఉండగా ఇంతవరకు 21 భవనాలు/సముదాయాలకు పన్ను విధించారు. కమిషనర్ ఆదేశాలలో వాటి కొలతలు తీసుకున్నప్పుడు గతంలో విధించిన పన్నుకు ప్రస్తుత పన్నుకు మధ్య భారీ వ్యత్యాసం కనిపించింది. అంటే ఏళ్లతరబడి పన్ను అధికారులు విఫలం కావడంతో పంచాయతీలు భారీ ఆదాయం కోల్పోయాయి. కాగా మూడువేల చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న వ్యాపార సంస్థలు వందల్లో ఉంటాయి. వీటిని తనిఖీ చేసి నిబంధనల మేరకు పన్ను విధిస్తే జిల్లాలో పన్నేతర ఆదాయం కోట్లకు పెరుగుతుంది. పన్నేతర ఆదాయంపై జిల్లా పంచాయతీ అధికారి ఎంఎన్‌వీ. శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా నిబంధన మేర పన్ను విధించాలని కార్యదర్శులకు ఆదేశించామన్నారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు, దుకాణాలు, మాల్స్ నుంచి పన్ను వసూలు చేసి ఆదాయం పెంచుకునే దిశగా పనిచేస్తున్నామన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



అమ్మవారికి నమస్కరిస్తున్న హైకోర్టు జడ్జి లక్ష్మణరావు దంపతులు

## కనకమహాలక్ష్మిని దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి

మహారాణిపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వై.లక్ష్మణరావు సతీసమేతంగా ఆదివారం శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జడ్జి గోత్రనామాలతో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి వేదాశీర్వచనాలు, శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ కార్యదర్శి ఎస్.సత్యనారయణ కూడా శ్రీకనక మహాలక్ష్మిని దర్శించుకున్నారు.

## నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను అందించాలని కోరారు.

# దళిత మైనారిటీ ద్రోహి వైసీపీ

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్

రామ్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ దళిత మైనారిటీ ద్రోహి అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులకు దళితులంటే ఎంత చిన్నచూపో తిరుపతి ఘటన ఉదాహరణగా నిలుస్తుందన్నారు. దళిత సమాజానికి వైసీపీ అధినేత జగన్‌తో పాటు ఆ పార్టీ నేతలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత యువకుడు పవన్‌ను తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నజీర్

కరుణాకర్‌రెడ్డి అనుచరులు అనిల్,దినేశ్‌రెడ్డిలు కిడ్నాప్ చేసి విచక్షణార హితంగా కొట్టడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం దళిత పవన్‌పై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడమూరు గోవింద్ మాట్లాడుతూ కరుణాకర్‌రెడ్డి అనుచరులు దళిత యువకుడిని ఏ విధంగా హింసించారో అదే వైసీపీ నిజ స్వరూపమని మండిపడ్డారు. సమావేశంలో ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పాసర్లపూడి జయరాజ్, కుమార్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల ప్రాణాలను కాపాడుతున్న రియల్ హీరో మహేశ్‌బాబు

» 'దక్షిణ' ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మహారాణిపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులకు ప్రాణ దానం చేస్తున్న రియల్ హీరో సూపర్‌స్టార్ మహేశ్‌బాబు అని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సరస్వతీ పార్కు కూడలిలో గ్రేటర్ విశాఖ సిటీ వైడ్ సూపర్‌స్టార్ కృష్ణ అండ్ ప్రిన్స్ మహేశ్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహేశ్‌బాబు 50వ జన్మదినోత్సవం సందర్భంగా జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మట్లాడుతూ కష్టమంటే కృష్ణ కుటుంబం ముందుంటుందని, అలాగే మహేశ్‌బాబు అభిమానులు కూడా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మన్నాల శ్రీనివాస్, డి.రమణ, కాకి సొంబాబు, బి.గణేశ్, నమ్మి గణేశ్, ఎన్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్, అభిమాన సంఘాల ప్రతినిధులు

# 'వెండి వినాయకుడిని ప్రతిష్ఠించి వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తాం'

డాబాగార్డెన్స్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వెనుక గల ఏపీఐఐసీ మైదానంలో నిర్వహించనున్నట్టు యూత్ ఐకాన్ అసోసియేషన్ నిర్వాహకుడు శీరపు కనకరాజు తెలిపారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పేరు దేశవ్యాప్తంగా వినిపించేలా వినూత్నంగా ఈసారి వెండి వినాయకుని ప్రతిష్ఠించనున్నట్టు పేర్కొన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణను కోరుతూ ఫ్లవర్ షో ఏర్పాటు చేయనున్నామన్నారు. అందరూ ఉచితంగా స్వామివారిని దర్శించుకోవచ్చని, గర్భిణులు, దివ్యాంగులు, వృద్ధులకు వలంటీర్ల సాయంతో దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు. ఈ నెల 27 నుంచి 25 రోజుల పాటు గణేశుని ఉత్సవాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్వచ్ఛందంగా దైవ సేవలో పాల్గొనదలచిన వారు www.youthicon.ganesh.comలో ఉచితంగా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎస్.లక్ష్మణ్, ఎస్.లీలాధర్, కె.భరత్, సురేశ్ (సూర్య), తదితరులు పాల్గొన్నారు.



# ప్రేక్షకులను ఆహ్లాదపరిచే చిత్రం 'పరదా'

» హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్

మహారాణిపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రేక్షకులందరినీ ఆహ్లాదపరిచేలా, ఆలోచింపజేసేలా 'పరదా' సినిమా ఉంటుందని హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ అన్నారు. ఆనంద్ మీడియా బ్యానర్‌పై విజయ్, శ్రీధర్, నిర్మాతలుగా అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా విశాఖ నగరానికి చెందిన కాండ్రేగుల ప్రవీణ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పరదా'. ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా హోటల్ గ్రీన్ పార్కులో ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ ఈ నెల 22న 'పరదా' విడుదల అవుతుందన్నారు. విభిన్నమైన కంటెంట్, ఫిక్షన్ కథాంశంతో రూపొందిన ఈ చిత్రాన్ని అందరూ ఇష్టపడి ఎంతో కష్టపడి తీయడం జరిగిందన్నారు. డైరెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ మంచి కథాబలం ఉన్న బలగం, కోర్టు వంటి చిన్న సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఆదరించారని, అదేవిధంగా తమ పరదా సినిమాను ఆదరించాలని కోరారు. ఒక ఊరిలో కఠినమైన




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అనుపమా పరమేశ్వరన్. చిత్రంలో డైరెక్టర్ కాండ్రేగుల ప్రవీణ్ తదితరులు ఉన్నారు

సంప్రదాయాలను ఎదిరించి సాహసమైన నిర్ణయాలను తీసుకునే మహిళగా అనుపమ 2.0ను ఈ చిత్రంలో చూడవచ్చన్నారు. సమావేశంలో నిర్మాతలు శ్రీధర్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.


విరాళాన్ని అందజేస్తున్న రమణ దంపతులు

## అన్నప్రసాద వితరణకు విరాళాలు

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలోని శ్రీవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం పంచామృతాలతో వేంకటేశ్వరస్వామిని అభిషేకించి పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి పూజలు జరిపారు. ఈ సందర్భంగా దివ్యక్షేత్రంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నప్రసాద వితరణకు అక్కిరెడ్డిపాలేనికి చెందిన నంబారు రమణ, ఝాన్సీ దంపతులు రూ.30 వేలు, పాపారావు అంజలి దంపతులు రూ.20 వేలను విరాళంగా పాలక మండలి సభ్యులకు అందజేశారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆటోనగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్‌వీ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు, ఏడీఈ ఎ.పార్థసారథి, ఏఈ రామకృష్ణ తెలిపారు. ఈ కారణంగా ఎల్‌వీ నగర్, శ్రీనివాసనగర్, కుంచుమాంబ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

### 'స్టీల్ ప్లాంటును పరిరక్షించాలి'

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటును పరిరక్షించేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారాం కోరారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్టీల్ ప్లాంట్ తృష్ణా మైదానం నుంచి టౌన్‌షిప్‌లోని అన్ని సెక్టార్లలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్లాంట్ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కర్మాగారంలో నెలకొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు యు.రామస్వామి, పి.శ్రీనివాసరాజు, పుల్లారావు, మోహిద్దీన్, నరసింగరావు, దుర్గాప్రసాద్, రమణ, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

### నిత్యావసర సరకుల పంపిణీ

అగనంపూడి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అగనంపూడి, పరిసర ప్రాంతాల్లో గల పలు పలువురు పేదలకు ఆదివారం నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న పేదలకు అండగా ఉండేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు శీరంశెట్టి గోవిందరావు, గుదే సుశీల గజేంద్రరరావు, ఐఆర్‌సీహెచ్ అప్పారావు, మస్తాన్‌రెడ్డి, చినఅప్పారావు, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

## సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 46, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 30, పచ్చిమిర్చి 62, కాకరకాయలు 28, బీరకాయలు 30, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 32, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ(పె)10, మునక్కాడలు (కిలో) 34, అల్లం(పాతది) 70, బరబాటి 22, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60, దోసకాయలు20, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 74, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు34, చిలగడదుంపలు 44, కంద 40, , గోరు చిక్కుడు 34, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు(కిలో)35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర(కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిదగుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామి డిఅల్లం56, బొప్పాయి 36,జామకాయలు (కిలో) 80.

**కోడిగుడ్లు (నెక్)**

| (వంద - రూ.లలో) | |
|---|---|
| విశాఖపట్నం | 510 |
| విజయనగరం | 514 |
| శ్రీకాకుళం | 514 |

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | |
|---|---|
| రైతు ధర | 93 |
| లైవ్ ధర | 113 |
| విత్ స్కిన్ | 196 |
| స్కిన్‌లెస్ | 206 |

# రైతన్నకు ఆసరాగా నిలిచిన కూటమి ప్రభుత్వం

### టీడీపీ 'పెందుర్తి' ఇన్‌చార్జి గండి బాబ్జీ


మార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

పెందుర్తి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం అమలుతో రైతన్నకు కూటమి ప్రభుత్వం ఆసరాగా నిలిచిందని టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అమలుపై రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం గండి బాబ్జీ ఆధ్వర్యంలో నియోజకవర్గ రైతులు మార్కెట్ యార్డులో సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కట్టుకథ కాదని, బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కావడంతో రైతుల మోముల్లో ఆనందం కనిపిస్తోందన్నారు. తొలి విడతగా జిల్లాలో 2,42,536 మంది రైతులకు రూ.161.45 కోట్లను వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. రైతుకు సాయం అందిచేలా 90 శాతం రాయితీతో బిందు సేద్య పరికరాలు, రైతు పథకం కింద రాయితీతో ట్రాక్టర్లు అందజేస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులను దగా చేసిందని ఆరోపించారు

**ట్రాక్టర్లతో భారీ ర్యాలీ**

అంతకుముందు ఇక్కడి టీడీపీ కార్యాలయం నుంచి నియోజవర్గంలో గల సబ్బవరం, పరవాడ, పెందుర్తి మండలాలకు చెందిన రైతులు సుమారు 72 ట్రాక్టర్లతో మార్కెట్ యార్డు వరకు ర్యాలీ చేపట్టారు. కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద చంద్రబాబు, మోదీ, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ర్యాలీలో పాల్గొన్న రైతులతో పాటు గండి బాబ్జీ, కూటమి నాయకులు పచ్చని కండువాలు ధరించారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎ.జ్యోతి అప్పలనాయుడు, కార్పొరేటర్లు సేనాపతి శంకరరావు, ముమ్మన దేవుడు, బల్ల శ్రీనివాసరావు, నాయకులు రెడ్డి నారాయణరావు, గొర్లె అప్పలనాయుడు, గండి ముత్యాలనాయుడు, గండి దేవుడుబాబు, బి.బాబూరావు, కె.వెంకటరమణ, పి.జగనాథం, వి. చిన్న, తదితరులు పాల్గొన్నారు

# కొత్తపాలెం పీఏసీఎస్‌కు పూర్వ వైభవం తెస్తాం

### డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు

**ప్రమాణ స్వీకారం చేసిన నూతన కార్యవర్గ సభ్యులు**


పీఏసీఎల్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కోన తాతారావు. చిత్రంలో ఎమ్మెల్యే గణబాబు తదితరులు

గోపాలపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కొత్తపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)కు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు అన్నారు. కొత్తపాలెం పీఏసీఎస్‌కు ఇటీవల ప్రభుత్వం నియమించిన నాన్-అఫీషియల్ పీఐసీ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం కమిటీ ఛైర్మన్ బొడ్డేటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అధ్యక్షతన ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోన తాతారావు మాట్లాడుతూ పూర్తిగా నిర్జీవ స్థితిలో ఉన్న కొత్తపాలెం పీఏసీఎస్‌కు పునర్జీవం కల్పించేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. నెల రోజుల్లో కొత్తపాలెం పీఏసీఎస్ నుంచి రైతులకు, సభ్యులకు, చిరు వ్యాపారులకు రుణాలు మంజూరు చేసేలా చూస్తామన్నారు.

ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఎటువంటి లావాదేవీలు జరగకుండా నిర్జీవ స్థితిలో ఉన్న కొత్తపాలెం పీఏసీఎస్‌ను అభివృద్ధి బాటలో నడిపించడానికి కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు తీసుకువచ్చామన్నారు. డీసీసీబీ సహకారంతో పీఏసీఎస్‌ను అభివృద్ధి చేసి స్థానిక రైతులకు, వ్యాపారులకు, గ్రామస్థులకు మేలు జరిగేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. పీఏసీఎస్ ఛైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్ మాట్లాడుతూ పీఏసీఎస్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. అనంతరం బొడ్డేటి విజయ్‌కుమార్, సభ్యులు గొన్నాబత్తుల అప్పలరాజు, కంపర ఆనంద్‌తో కోన తాతారావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దాడి వెంకటరమేశ్, బొమ్మిడి రమణ, నాయకుడు శరగడం రాజశేఖర్‌తో పాటు అధిక సంఖ్యలో కూటమి నేతలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# దువ్వాడ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్


మొక్కలు నాటుతున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు

కూర్మన్నపాలెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దువ్వాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం-1లో పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. జడ్‌ఆర్‌సీసీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అమిరెడ్డి మురళీధరరెడ్డి, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాషువా మాట్లాడుతూ దువ్వాడ రైల్వే స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలనే లక్ష్యంతో స్వచ్ఛ భారత్, అవగాహన ర్యాలీని రైల్వే ఉన్నతాధికారుల అనుమతితో నిర్వహించామన్నారు. స్టేషన్ టికెట్ కౌంటర్, వీఐపీ లాంజ్, వాహనాల పార్కింగ్, మెయిన్ సిగ్నల్ క్యాబిన్, టికెట్ కౌంటర్ వెనుక రోడ్డులో ప్లాస్టిక్ కవర్లను, చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రపరిచామన్నారు. అలాగే స్టేషన్ ఆవరణను చీపుర్లతో ఊడ్చామన్నారు. అనంతరం స్టేషన్ పరిసరాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రైల్వే యూజర్స్ అసోసియేషన్ సభ్యులు, మానవ వనరుల సంఘం సభ్యులు, రైల్వే, ఆర్పీఎఫ్ సిబ్బంది, స్పందన చేయూత ఫౌండేషన్, మానవ వికాస వేదిక, మానవత,సత్యసాయి సేవా సమితి, సర్వహిత చారిటబుల్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్, యూత్ హాస్టల్స్ సభ్యులు పాల్గొన్నారు.


పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఈయూ నాయకులు

### ఆర్టీసీ స్టీల్ సిటీ డిపోను ఖాళీ చేయించకుండా చూడాలని 'పల్లా'కు వినతి

కూర్మన్నపాలెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ స్టీల్ సిటీ డిపో స్టీల్ ప్లాంటుకు చెందిన స్థలంలో ఉండడం.. దీని లీజు గడువు పూర్తి కావడంతో నవంబరులోగా ఖాళీ చేయాలని ఉక్కు యాజమాన్యం చెబుతున్నందున డిపోను ఇక్కడే కొనసాగించేలా చూడాలని కోరుతూ ఆదివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తిలు వినతిపత్రాన్ని అందజేశారు. మరో 33 ఏళ్లపాటు లీజు గడువు పెంచేలా చూడాలన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ఉక్కుశాఖ మంత్రులు, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పల్లా పేర్కొన్నారు. పల్లాను కలిసిన వారిలో ఈయూ జిల్లా నాయకులు కేఎస్ఎన్ మూర్తి, కె.శ్రీనివాసరావు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్ ప్రకాశ్, బి.రాము, జోనల్ నాయకులు రవికాంత్, తాతలు, స్వామి, కె.సత్తిబాబు, తదితరులు ఉన్నారు.

### కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

పెదగంట్యాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సమాన ప్రాధాన్యతనిస్తోందని జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు అన్నారు. బర్మా కాలనీలో రూ.15.5 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డులోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, అన్ని కాలనీలకు మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు జి.అప్పలరాజు, కార్యదర్శి కూన వెంకటరావు, కాలనీ పెద్దలు బొడ్డు సత్యారావు,నారాయణ,రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### 90వ వార్డులో అభివృద్ధి పనులకు..

ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 90వ వార్డు పరిధి విమాన్‌నగర్ లైన్ నంబర్-10లో రూ.40 లక్షలతో చేపడుతున్న వీధి రోడ్లు, కాలువ పనులకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90వ వార్డులో మౌలికవసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందని, ఇందులో భాగంగా అన్ని ప్రాంతాల్లో రహదారులు, కాలువల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు.కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జగన్మోహనరావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు శరగడం అరుణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వరరావు, పీవీ రావు, శ్రీకాంత్, నాగు, తదితరులు పాల్గొన్నారు.

### 19న నర్సింగబిల్లి అమ్మవారి పండుగ

వేపగుంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట, వేపగుంట పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవత శ్రీనర్సింగబిల్లి అమ్మవారి పండుగను ఈ నెల 19న వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సమావేశంలో గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశంలో పండుగకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో కార్పొరేటర్ రాపర్తి కన్నా, ముత్తా నాయుడు, గంట్ల దేముడు, తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అదానీ స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ సీపీఎం గాజువాక డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం చుక్కవానిపాలెంలో జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.రాంబాబు మాట్లాడుతు నిత్యావసర సరకుల ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న ప్రజలపై స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో మరింత భారాన్ని మోపేందుకు ప్రభుత్వం యత్నిస్తుండడం సిగ్గుచేటన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు యోచనను విరమించుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. నాయకులు వి.రాజు, అవతారం, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

### ఎక్మో చికిత్సతో ప్రాణదానం చేసిన కిమ్స్ వైద్యులు

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): విష వాయువు పీల్చడంతో పలుమార్లు ఆగిన యువకుని గుండెకు ఎక్మో చికిత్సతో కిమ్స్ ఐకాన్ వైద్యులు ప్రాణదానం చేశారు. షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి యాజమాన్యం ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అగనంపూడికి చెందిన లక్ష్మణ్‌కుమార్ పాండా స్థానిక పార్మా కంపెనీలో పనిచేస్తున్నారు. గత వారం విధుల్లో ఉండగా ప్రమాదకరమైన వాయువును పీల్చడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకురాగా, అప్పటికే లక్ష్మణ్‌కు మార్ కార్డియక్ అరెస్టయినట్టు వైద్యులు గుర్తించారు. సిబ్బంది సీపీఆర్ చేసినా లక్ష్మణ్ గుండె పదే పదే ఆగుతుండడంతో క్రిటికెల్ కేర్ విభాగం వైద్యులు ఎం.రవికృష్ణ, ఎం.సాయిమణికంఠన్, రవి కన్నాలు ఎక్మో పెట్టి సీపీఆర్ చేయాలని నిర్ణయించారు. లక్ష్మణ్ గుండె, ఊపిరితిత్తులు చేయాల్సిన పనిని ఎక్మో మిషన్ చేయడంతో లక్ష్మణ్ త్వరగా కోలుకున్నారని డాక్టర్ రవికృష్ణ తెలిపారు. లక్ష్మణ్‌ను కాపాడిన వైద్యులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### దుర్గమాంబ ఆలయం ప్రారంభం

అగనంపూడి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక పైడిమాంబ ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుర్గమాంబ ఆలయాన్ని ఆదివారం నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. వేదపండితులతో అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు విందుల నారాయణరావు, నెల్లి శ్రీను, కె.అప్పారావు, వి.సూర్యారావు, వి.రాము, ఎం.ఉమామహేశ్వరరావు, జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా జాతీయ పతాక ఉత్సవాలు

అగనంపూడి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి శ్రీసత్యసాయి బాల వికాస్ సంస్థ ఆధ్వర్యంలో కొండయ్యవలసలోని బాల వికాస్ కేంద్రంలో ఆదివారం జాతీయ పతాక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చిన్నారులకు భజన, క్విజ్, సాంస్కృతిక, ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. భారతదేశం గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు విందుల వరహాలు, బి.సత్యనారాయణ, వి.రామారావు, పద్మలత, గోవిందరావు, రఘునాథరావు, సుబ్బారావు, గౌతమ్, కార్తీక్, పైడినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### పెన్షనర్లకు కేంద్రం న్యాయం చేయాలి

మల్కాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారులకు న్యాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని పెన్షనర్ల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. మల్కాపురంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం పెన్షనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ పెన్షనర్ల హక్కుల సాధన కోసం ఈ కమిటీ ఏర్పడిందన్నారు. ఇటీవల పెన్షనర్ల హక్కులపై అనేక పోరాటాలు జరిగాయని, ఆయా ఆందోళనల్లో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమస్యల సాధన కోసం ఇలా సమష్టిగా పోరాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సీహెచ్ తమ్మారావు, ఎస్‌కే హుస్సేన్, కె.నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

## క్రైం... crime news

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గాజువాక, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కర్ణవానిపాలెం వై-జంక్షన్‌లో శనివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్వతంత్రనగర్‌కు చెందిన ఎ.మోహన్‌కుమార్ (23) రామకృష్ణ అనే యువకుడితో కలిసి ద్విచక్ర వాహనంపై గంగవరం నుంచి వై-జంక్షన్ మీదుగా జగ్గు జంక్షన్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో మోహన్‌కుమార్‌కు తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మరో యువకుడికి తీవ్ర గాయాలవ్వడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రమాదవశాత్తు సముద్రంలో మునిగి వ్యక్తి మృతి


అప్పలరెడ్డి (ఫైల్)

భీమునిపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో సరదాగా ఈతకు దిగిన వ్యక్తి కెరటాల ఉధృతికి లోపలకు కొట్టుకుపోవడంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లలపాలెం గ్రామానికి ఎలక్ట్రీషియన్ సరగడ అప్పలరెడ్డి (45) ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి భీమిలి బీచ్‌కు విహారానికి వచ్చాడు. ఈ క్రమంలో అప్పలరెడ్డి,ఆయన కుమారుడు మోజెస్, మరో ఇద్దరు సముద్రంలో స్నానాలకు దిగారు. ఈత కొడుతుండగా పెద్ద కెరటం తాకిడికి అప్పలరెడ్డి సముద్రం లోపలికి కొట్టుకుపోయాడు. మోజెస్, మిగతా కుటుంబ సభ్యులు చూసి గట్టిగా కేకలు వేయడంతో ఫొటో గ్రాఫర్లు కొక్కిరి వీర్రాజు, కాసరపు అనిల్, రాము వెంటనే సముద్రంలోకి దూకి ఆయన్ను ఒడ్డుకు చేర్చారు. కొన ఊపిరితో ఉన్న ఆయనను స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య అరుణకుమారి, కుమారుడు మోజెస్, కుమార్తె శ్యామ్ ఉన్నారు. అరుణకుమారి వస్త్ర దుకాణంలో పని చేస్తోంది. అప్పలరెడ్డి స్వగ్రామం తగరపువలసలోని సంతపేట గొల్లవీధి కాగా బతుకు తెరువు కోసం ఆరేళ్ల క్రితం గొల్లలపాలెం వచ్చారు. అరుణకుమారి ఫిర్యాదు మేరకు హెచ్‌సీ అమ్మోరు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### యారాడ తీరంలో యువకుడిని కాపాడిన లైఫ్ గార్డులు


మహేశ్‌ను ఒడ్డుకు తెచ్చిన లైఫ్ గార్డులు

సింధియా, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): యారాడ సముద్రంలో సరదాగా స్నానానికి దిగి ప్రాణాపాయ స్థితిలో చిక్కుకున్న గంగవరం గ్రామానికి చెందిన గరికన మహేశ్ (30) అనే యువకుడిని లైఫ్ గార్డులు రక్షించారు. ఆదివారం మధ్యాహ్నం మహేశ్ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడిపేందుకు యారాడ తీరానికి వచ్చాడు. ఈ సందర్భంగా సరదాగా బీచ్‌లో స్నానానిడి దిగాడు.కెరటాల ఉధృతికి ఒక్కసారిగా మహేశ్ కొట్టుకుపోవడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు పెద్దగా కేకలు వేశారు. దీంతో సమీపంలో ఉన్న లైఫ్ గార్డులు సముద్రంలోకి వెళ్లి మహేశ్‌ను సురక్షితంగా ఒడ్డుకు తేవడంతో ప్రాణాపాయం తప్పింది. అనంతరం మెరైన్ సీఐ దివాకర్ ఆదేశాల మేరకు పీసీ అరుణేశ్వరరావు, హోంగార్డు అప్పారావులు ఆ యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.